# ఈ రాత్రి తెల్లారదు!

## సికిందర్

విజయవాడ బీసెంట్ రోడ్డులో సాయంత్రం పూట ఎవరికీ వర్ణించనవసరం లేదు.

హైదరాబాదులో సుల్తాన్ బజారు చూసినవాళ్ళు దాన్ని వూహించుకోవచ్చు. సుల్తాన్ బజార్‌లా అస్తవ్యస్తంగా, ఇరుకుగా లేకపోయినా, జనసందోహానికేమాత్రం తీసిపోదు. పెద్ద బిజినెస్ సెంటర్.

సైకిళ్ళు, బళ్ళు, రిక్షాలు, మోటార్ కార్లు, కాలినడకన వెళ్ళేవాళ్ళతో, ఇరువైపులా కళ్ళు చెదిరేలా అలంకరింపబడ్డ షాపులతో, హోటళ్ళతో, ఎంత హడావుడిగా వుంటుందో అంత మనోహరంగానూ వుంటుంది.

అలాంటి ఓ సాయంత్రం పూట నేను 'నవీన్ టెక్స్‌టైల్స్' షాపు ముందు నిలబడి అక్కడున్న క్రీం కలర్ ఫియట్ కారును తదేకంగా చూస్తున్నాను.

ఫియట్ కార్లంటే నాకిష్టం. అలాటిదొకటి ఎప్పటికైనా నా స్వంతం చేసుకోవాలన్న ఆలోచన కూడా వుంది. అయితే అందుకు చాలా కష్టపడాలని నాకు తెలుసు. కష్టించకుండా ఈ సృష్టిలో యేదీ సాధ్యం కాదు.

ఇంతలో నా దృష్టి షాపులోంచి బయటికొచ్చిన ఇద్దరు యువతులపైన పడింది. ఆసక్తిగా వాళ్ళను చూశాను. ఆ కారు వాళ్ళదేనేమో?

ఆ ఇద్దర్లో ఒకామె తెల్లచీరలో వుంది. మరొకామె నీలిచీర కట్టుకొంది. నీలిచీర యువతి నాకు నచ్చలేదు. ఆమె చేపకళ్ళు అసహ్యంగా వున్నాయి! ముక్కు తీరు చండాలంగా వుంది! ఇష్టమనేది మొదటి చూపులోనే ఏర్పడాలి. నాకామె పైన ఏర్పడలేదు. కానీ తెల్లచీర యువతి అమితంగా ఆకర్షించిందని చెప్పక తప్పదు! ఆమె గుండ్రటి నల్లటి కళ్ళు, గులాబీపువ్వులాటి నోరు, పల్చటి పెదవులు, ప్రశాంతవదనం—ఇవేగాక ఆమె విగ్రహం కూడా ఎంతో నాజూకుగా, సున్నితంగా వుంది.

అలాటి రూపవతిని నేనిదివరకు ఎక్కడైనా చూశానా అని తర్జన భర్జన చేసికొన్న పిమ్మట, లేదని తేలింది.

ఆమె వయసు పాతిక మించదు. చేతిలో రెండు ప్యాకెట్లు వున్నాయి. బహుశ చీరలు కావచ్చు. వాటి బరువు కామె కోమలమైన చేతులెక్కడ కందిపోతాయోనని ఎవరైనా బాధపడుతున్నారేమో చూశాను. ఆమెనెవరూ గమనించడంలేదు, నేను తప్ప. ఆమె నీలిచీర యువతికంటే డబ్బు గలదని గ్రహించాను.

నా ఆలోచనలిలా సాగుతుండగా, వాళ్ళిద్దరేదో చెప్పుకుంటూ మెట్లు దిగుతున్నారు. ఇంతలో యెక్కడినుంచి

వూడిపడ్డాడో, ఒక హిప్పీలాంటి రోమియో వాళ్ళముందు ప్రత్యక్షమయ్యాడు.

వాడికి వానర లక్షణాలన్నీ వున్నాయి, వాలం మినహా. పొడవాటి వెంట్రుకలు దుమ్ముపట్టి భుజాలమీద వ్రేలాడుతున్నాయి. కళ్ళు కన్పించడంలేదు. అంగుళం మందం జిడ్డు కన్పిస్తున్న ఒంటిమీద ఆకర్షణీయమైన సరిక్రొత్త పువ్వుల చొక్కా వుంది. మిగతా సగం దేహం మీద చింకిప్యాంటు పావడాలా గాలికి రెపరెపలాడుతోంది.

వాడొకసారి చేత్తో వెంట్రుకల్ని వెనక్కి దోపుకొని తలెగరేశాడు. గబగబా మెట్లెక్కుతూ తెల్లచీర యువతిని ఢీకొన్నాడు.

ఆమె కెవ్వునరిచి ప్యాకెట్లు వదిలేసింది. కాని, నీలిచీర యువతిమాత్రం ధైర్యంగా వాడి చెంపమీదకొట్టింది. ఆ విసురుకు వాడు తూలి, గిరగిర తిరుగుతూవెళ్ళి రిక్షా చక్రాలక్రింద పడ్డాడు. స్ప్రింగులా లేచి, ఒక్క రంకె వేసి, తిరిగి వాళ్ళమీదకు లంఘించాడు.

ఈసారి నీలిచీర యువతికూడా బెదిరిపోయింది.

వాడు తెల్లచీర యువతి చెయ్యిపట్టి దగ్గరకి లాగాడు. ఆమె మరోసారి కేకపెట్టింది. రోడ్డుమీద ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించి జనం గుమిగూడారు. వాడా యువతిని చరచరా లాక్కొచ్చి రిక్షా ఎక్కిస్తున్నా వాడ్ని అడ్డుకొనేవారు యెవరూలేరు. అంతా చోద్యం తిలకిస్తున్నారు.

నేనొక్కసారిగా తేరుకొని ఏం జరుగుతుందో గ్రహించాను. విసురుగా జనాన్ని తోసుకొని రిక్షాదగ్గరకెళ్ళాను. అప్పటికామె రిక్షాలో వుంది. నన్నుచూసి రోమియో

కిచకిచ మన్నాడు. రిక్షావాడ్ని ప్రక్కకు తోసేసి దర్జాగా ఎక్కబోయాడు. ఆలస్యం చెయ్యకుండా వాడి మెడపట్టి క్రిందకు లాగేశాను. బోర్లాపడ్డాడు!

అంతే—

మా ఇద్దరిమధ్య ముష్టియుద్ధం ప్రారంభమైంది. వాడికి నాకంటే ఎక్కువ బలం వుంది. వాడు నన్ను పట్టుకొని ఎక్కడపడితే అక్కడ కొడుతున్నాడు! నా ముఖం మీద ఒకటి, మెడమీద ఒకటి దెబ్బలుపడ్డాక, ఎందుకు శౌర్యం చేసుకొన్నానా అనిపించింది. జనం నుంచి ఎవరూ నన్ను రక్షించడానికి రావడంలేదు! ఎక్కడా ఒక్క పోలీసు లేడు!

హఠాత్తుగా రెచ్చిపోయాను. ఇంతమందిలో వీడి చేత తన్నులు తిని నవ్వులపాలు అవాలా! శక్తినంతా పుంజుకొని వాడ్ని లేపి గిరగిరా తిప్పి వదిలేశాను. వాడి వొళ్ళు గుల్లలా తేలిగ్గా వుంది. గాల్లో అలా....అలా....ఎగురుతూ వెళ్లి టెలిగ్రాఫ్ స్థంభాన్ని కరుచుకున్నంత పనిజేసి, జారి క్రిందపడ్డాడు.

జనం అటుకేసి పరిగెత్తారు. నన్ను మెచ్చుకోవడానికెవరూ మిగల్లేదు! బట్టలు దులుపుకొని తల సవరించుకొన్నాను. ఆ యువతులిద్దరూ కంగారుగా నన్ను సమీపించారు. తెల్లచీర యువతి సందేహించకుండా నా వొళ్ళు తడిమిచూసింది.

"అయ్యో—నుదురు బొప్పి కట్టింది!" అర్చిందామె.

"ఫరవాలేదు" అన్నాను. అంత బాధలోనూ ఆ నీలి చీర యువతి మీద నా అసహ్యం పోలేదు. ఆమె కూడా నన్ను ముట్టుకోబోతే దూరంగా నెట్టాను.

"మీరు వెళ్ళిపొండి! వాడిక లేవడు" అన్నాను.

"కాని మీరు బాగా గాయపడ్డారు!" తెల్లచీర యువతి అంది.

"ఫరవాలేదు, నేను గాకపోతే మీరు పడేవారు. మీరు త్వరగా వెళ్లిపోవాలి! లేకపోతే యిక్కడ న్యూసెన్స్."

"పోలీసుల్ని పిలుద్దాం!" నీలిచీర యువతి అడ్డు తగిలింది.

"ఊహూ వద్దు! పద వెళ్దాం!" తెల్లచీర యువతి కారు డోర్ తెరిచింది. తటాలున తిరిగి నన్ను చూసి, "మీరు కూడా రండి, మా ఇంటికెళ్దాం!" అంది.

"ఫరవాలేదు, మీరు వెళ్ళిరండి!" అన్నాను మొహమాటపడుతూ.

"మీ ఫరవాలేదు, పాడుగాను! త్వరగా కారెక్కండి వెళ్లిపోవాలి!"

నీలిచీర యువతి కూడా తొందర పెట్టింది. ఏం చెప్పాలో తోచక ఎక్కి ముందు సీట్లో కూర్చున్నాను. తెల్లచీర యువతి స్టార్టు చేసింది. నీలిచీర యువతి వెనక కూర్చుంది.

కారు బయలుదేరేక తెల్లచీర యువతి అంది "మా కోసం మీరు చాలా రిస్కు తీసుకొన్నారు. నడి బజార్లో అలా కొట్లాడటం మీ పరువుకు తక్కువ కాదా?"

నవ్వాను. "మీ క్షేమంకంటే నా పరువు ముఖ్యమనిపించలేదు."

"కానీ మీలా ఆలోచించేవా రెందరు?"

"ఆ జనంలో ఒక్కరూ కనిపించలేదు."

"జనం సాడిస్టులవుతున్నారు. దౌర్జన్యం జరుగుతోంటే చూస్తూ ఆనందించడం ఫాషనయిపోయింది.

కానీ మీరలా కాదు-అందుకు భిన్నంగా ప్రవర్తించారు."

"అవును."

"అందు కేదేనా కారణముందా?" అనుమానంగా చూసిందామె.

"వుండాలా? అయితే వినండి! మీ కారు నన్నా కర్షించింది. ఫియట్ కార్లంటే నా కిష్టం."

"అంటే? కారు చూసి రక్షించారా? నాకు వేరే కారుంటే?"

"నే నా జనంలో వుండేవాడిని."

నవ్విందామె. నన్నాకర్షించింది కారు కాదనీ తనేనని అనుకుంది కాబోలు మరోసారి గర్వంగా నవ్వింది.

"క్షమించండి, మీ పేరు చెప్పలేదు" అన్నాను.

"విమల...." అందామె, "మీ పేరు?"

"కుమార్ —కిరణ్ కుమార్."

"ఓహ్! ఆమె నా ఫ్రెండ్ చిత్ర!" అందామె మళ్ళీ.

"కుమార్ గురూ, మేం మీకు చాలా థాంక్స్ చెప్పాలండీ!" అంది చిత్ర.

నాకు వొళ్ళు మండింది. షటప్, యూబిచ్! అనుకున్నాను.

విమల అంది "మీరేం చేస్తుంటారు?"

"ఏమీ లేదు."

"అంటే?"

మూడు నెలలుగా వూరికే వుంటున్నాను."

"అంతకు ముందు?"

"విశాఖలో వున్నాను."

"అక్కడేం చేసేవారు?"

"షిప్ యార్డులో మెకానికల్ ఇంజనీర్ని."

"మరి ఇప్పుడు?" ఆత్రుతగా అడిగిందామె.

"ఆ ఉద్యోగం వదిలేశాను.... నా భార్యవల్ల. ఆమెకి కోర్కె లెక్కువ. ఎప్పుడూ దేనికోసమో సాధిస్తుండేది. నేనామె కోరికల్ని తీర్చలేకపోయేవాడ్ని. ఒకరాత్రి విరక్తితో చీరకు నిప్పంటించుకొని చచ్చిపోయింది."

"ఏమిటీ? ఆమె ఆత్మహత్య చేసుకుందా?"

"అవును.... దాంతో నేను పిచ్చివాడినయ్యాను.ఏ పనీ చేయలేక ఇలా వూరికే తిరుగుతున్నాను."

"నాకు చాలా విచారంగా వుంది. మీ పరిస్థితిని చూడలేను."

"మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి. ఇహ నా గురించి చెప్పుకోను."

ఆమె మాట్లాడలేదు. మౌనంగా డ్రైవ్ చేస్తోంది. కానీ తీవ్రంగా ఆలోచిస్తోంది. హఠాత్తుగా నా వొళ్ళు అంతా నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమెతో మాట్లాడుతున్నంత సేపూ ఏమీ అనిపించలేదు. ఇప్పుడు భరించలేకపోతున్నాను.

"ఏదేనా మాట్లాడండి!" అన్నాను.

ఆమె వులికిపడింది "ఏమన్నారూ?"

"ఏదేనా మాట్లాడండి. మీ మాటల్లో ఈ నొప్పులు మర్చిపోతున్నాను."

"ఓహ్, మిమ్మల్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి!"

"వద్దు! మీ మాటలే చక్కటి మందు!"

ఆమె ఒక్కసారిగా మెరిసే కళ్ళతో నన్నుచూసింది. ఇందాకటిలా కారు నడ్డం పెట్టుకొనిగాక, ప్రత్యక్షంగా ఆమెనిలా పొగడటంవల్ల తన సౌందర్యంపట్ల విశ్వాసం ఇంకా పెరిగినట్లనిపించిందేమో, ఆ చూపుల్లో కృతజ్ఞత

మెరుస్తోంది.

నేను తల వంచుకున్నాను.

ఆమె తల తిప్పి ఆదోలా నవ్వి అంది "మీ అంతటి మొహమాటం మనిషిని నే నెక్కడా చూడలేదు."

తలెత్తి ఆమెని చూశాను. ఆమె నన్ను చూడలేదు.

"మొహమాటమనేది లేకపోతే సంబంధాలెంత ఘోరంగా వుంటాయో మీకు తెలుసు" అన్నాను.

ఆమె నవ్వింది. "అయినా నాకు మొహమాటం లేదు. అలాగని నేనెవరితోనూ మంచి సంబంధాలేర్పరచుకోలేననుకోండి."

"మీరున్న స్థితిలో సంబంధాలేర్పరచుకొనే అవసరం మీకు లేదు. ఇతరులే మీతో ఏర్పరచుకోడానికి తాపత్రయపడతారు. కనుక మీకు మొహమాట ముండాలన్న ప్రశ్నే లేదు" అన్నాను.

"కుమార్ గారు చాలా మంచిమాట అన్నారు!" చిత్ర సంతోషం వ్యక్తం చేసింది.

నోర్మూయ్, వదరుబోతు పిట్టా! తిట్టుకున్నాను.

విమల నన్ను సూటిగా చూసింది. "కాని మిమ్మల్ని చూసే మతిస్థిమితం తప్పినవారిలా కన్పించడంలేదు.... మీ భార్య గురించి ఇప్పుడు పూర్తిగా మరిచిపోయారా?"

"మర్చిపోతానా? అది నావల్లగాదు. ఆమె ప్రతీ చోటా, ప్రతీ వస్తువులో కన్పిస్తోంది. నాతో పోరు పెట్టుకోనంతవరకు ఆమె బాగానే వుండేది.... సన్నిహితంగా అణకువగా. చాలా అమాయకురాలు. కానీ హద్దుమీరిన కోరికలామెని బలితీసుకున్నాయి.... కాదు, నేను బలి ఇచ్చాను. నేను అసమర్థుడ్ని. ఆమె జ్ఞాపకం వచ్చినప్పుడల్లా దుఃఖం ఆగదు. కానీ మనస్సులో వ్యథల్ని

ముఖంమీద పులుముకొని ఇతరుల సానుభూతి పొందా లన్న దుగ్ధ నా కెన్నడూ లేదు. ఈ ప్రపంచంలో ఎవరి సమస్యలు వారికున్నాయి. నా బాధలు నేను పడతాను. ఎవరో నన్నెందుకో ఓదార్చాలని ఎందుకనుకోవాలి?"

ఆమె స్తబ్ధురాలయింది. మాట్లాడలేదు. నా మాట లామె పయిన తీవ్రమయిన ప్రభావాన్ని కల్గించాయి. ఆమె చాలా సున్నిత మనస్తత్వం గలదని గాయపడ్డ కళ్ళను చూసి వూహించవచ్చు.

"నో కిరణ్! ఒకరి కష్టాల్ని సహించలేను. మీ పరిస్థితిని చూసి వూరుకోలేను" అందామె. "నేను—నేనూ చాలా బాధ లనుభవించాను. ఈ బ్రతుకుతో విసిగి పోయాను. మీలాగే ఒంటరితనం అనుభవిస్తున్నాను.... చూడండి, మిమ్మల్నెవరూ ఆదుకోరనుకోకండి. సాటి మనిషిగా మిమ్మల్ని ఆదుకొనే ధర్మం, బాధ్యతా నాకు న్నాయి. కాదనకండి."

ఆశ్చర్యపోయి చూశాను.

"మీరేమంటున్నారో అర్థం గావడం లేదు! అనామకుడ్ని ఆదుకోవడం మీ శ్రేయస్సుకి మంచిదికాదు."

"మీరు అనామకులా? ఎప్పుడు? పరిచయం కాక మునుపు! ఇప్పుడు నాకు సన్నిహితులు....నన్నో దుర్మార్గుడి బారినుండి కాపాడారు. నా ప్రతిష్ట నిలబెట్టారు. లేదు, మీరు చేసిన సహాయానికి ఇంటికి తీసికెళ్ళి ఓ కప్పు కాఫీతో ఋణం తీర్చుకోలేను. నా శాయశక్తులా మీ కష్టాల్లో తోడ్పడుతాను....తిరిగి మిమ్మల్ని మామూలు మనిషిని చేస్తేనే నాకు సంతృప్తి."

"మీ నుంచి నేనే ప్రతిఫలమూ ఆశించలేను. సారీ!"

"అలాగంటే లాభం లేదు కుమార్ గారూ! ఆమె సంగతి మీకు తెలీదు. మూడేళ్ళ క్రితం తుఫానులో కాళ్ళరిగేలా తిరిగి సేవ చేసింది. ఎవరి కష్టాల్ని చూసి ఆమె వూరుకోలేదు. మీరిప్పుడు ఆమె బారినుండి తప్పించుకోలేరు" అంది చిత్ర ఆవేశంగా.

"మీ ఆడవాళ్ళెలా ఆలోచిస్తారో అర్థంగాదు. మిమ్మల్ని నేను గాకపోయినా, ఎవరూ గాకపోయినా చివరికెలాగో పోలీసయినా కాపాడి వుండేవాడు. అంత మాత్రాన ఋణం తీర్చుకుంటామని అతనిమీద కెగబడతారా! కారాపండి-దిగిపోతాను."

ఆమె కారాపలేదు. భారంగా నిట్టూర్చింది. "సరే, క్షమించండి. ఈ కొన్ని నిమిషాల పరిచయంలో నేను చాలా చనువు తీసుకొన్నాను.... నా ఆలోచనలు చాలా దూరం సాగుతున్నాయి, మర్చిపోండి."

"అయితే ఫరవాలేదు—మీరు ఋణం గుణం అంటూ పోరు పెట్టనంతవరకు. నేనో రోమియోనని తన్నాను. మీతో పరిచయమయింది. ఇది చాలా కాకతాళీయం. దీన్ని సీరియస్ గా తీసుకుని ఆవేదన చెందవల్సిన పని లేదు."

ఆమె అదోలా నవ్వుకొని వేగం పెంచింది. కారు లక్ష్మీపేట చేరాక కొన్ని వీథులు తిరిగి ఒక మేడముందు ఆగింది. గేటు దగ్గర ఆమె కోసమే ఎదురు చూస్తున్నట్లున్న ఓ యాభై ఏళ్ళ మనిషి రెక్కలు తెరిచి వినయంగా నిలుచున్నాడు.

విమల కారు లోనికి పోనిచ్చి ఆపింది. ముగ్గురం దిగాం.

"ఇదే మా యిల్లు" అంది విమల.

"చాలా బాగుంది" అన్నాను చుట్టూ చూస్తూ. పరిస

రాలన్నీ మొక్కలతో నిశ్శబ్దంగా వున్నాయి.

ముగ్గురమూ ఇంట్లోకి నడిచాం. విశాలమైన హాలు. గదులన్నీ ఖాళీగా, నిశ్శబ్దంగా కన్పిస్తున్నాయి. హఠాత్తుగా నాకా వాతావరణం వింతగా, భయంగా తోచింది.

"ఇంట్లో ఎవరూ లేరా?" అడిగాను సందేహిస్తూ.

విమల తలూపింది. "వున్నాం——నేనూ చిత్ర. రాజూ కాంతం-పనివాళ్ళు. వీళ్లుతప్ప నాకెవరూ లేరు. రాజూ, త్వరగా మూడు కాఫీలు పంపు" అర్చిందామె.

నేను సోఫాలో కూర్చొని చుట్టూ చూడసాగాను. వాళ్ళిద్దరు నా ఎదురుగా కూర్చున్నారు. విమల గబ గబ ఏదో మాట్లాడుతోంది. ఏదీ నా తల కెక్కడం లేదు. కాఫీలొచ్చాక తాగడం ప్రారంభించాం. రాజు నన్ను అనుమానంగా అదోలా చూడడం గమనించాను. అతనికి నేనంటే యిష్టం లేదని గ్రహించాను.

"ఇప్పుడు చెప్పండి——మీరేమీ మాట్లాడలేదు" అంది విమల.

తేరుకొని నవ్వాను. అనాలోచితంగా "ఇంత పెద్ద ఇంట్లో మీకు భయంగా వుండదా?" అన్నాను.

నవ్విందామె "దర్జాగా వుంటుంది. విజయవాడ మరీ అంత ఢిల్లీలోలా నేరాలతో వుడికిపోవడంలేదు. ఇక్కడి ప్రజలకి శాంతియుత జీవనంలో విశ్వాసముంది."

"నాకు ప్రజాశ్వామ్యంలోనే విశ్వాసం లేదు" అన్నాను.

"మరెందులో వుంది?"

"అస్తికవాదంలో. ఉన్నపళంగా ప్రళయం ముంచుకొచ్చి ప్రపంచమంతా కొట్టుకుపోవాలి."

చిత్ర పక పకా నవ్వింది. వంద కాకులు ఒక్కసారిగా అరుస్తున్నట్లు హోరెత్తించింది. చెవులు గట్టిగా మూసుకోవాలనుకొన్నాను. కానీ మర్యాద కాదనిపించింది. అంతకంటే లేచి బయటికి దారి తీయడమే మంచిది.

థాంక్స్ చెప్పి బయలుదేరుతున్నప్పుడు విమల ఉదయం పది గంటలకి రమ్మని బ్రతిమాలింది. ఏమనాలి? ఏమీ అనలేకపోయాను.

## 2

ఎంత వద్దనుకొన్నా ఆ రాత్రి విమల గురించి ఆలోచించకుండా వుండలేకపోయాను. ఎంత ప్రయత్నించినా నా మనోఫలకం మీద ఆమె సుందర రూపం చెరిపేయలేకపోయాను. ఆ రాత్రి నిద్రలేదు. ఆమె గురించి ఆలోచనలతో తెల్లారిపోయింది.

ఆమె నన్ను ఆకర్షించింది. అవును, మొదటి చూపులోనే ఆకర్షించింది. ఇందులో సందేహం లేదు. ఇంత బలంగా నన్నెవరూ ఇంతవరకు ఆకర్షించలేదు.

అయితే నా గురించి ఆమె అభిప్రాయమేమిటి? నేనామె నాకర్షించానా? నా అంతస్తు ఆమెకన్నో మెట్ల క్రింద వుంది. కనబడ్డ ప్రతివాడూ ఆమె నాకర్షించాలని లేదు. నేనలా ఆశించడం చాలా పొరపాటు.

కానీ ఆమె నా ఋణం తీర్చుకొంటానంది. అలా మాటవరసకన్నదా, లేక ఉద్దేశపూర్వకంగానా? ఆమెని చూస్తే సీరియస్ మనిషిలానే కన్పిస్తోంది. అనుకొన్నది నెరవేర్చి తీరుతుంది.

అంతటితో ఆమె నా పరిచయాన్ని త్రెంచుకోవాలనుకోలేదు. రేపు రమ్మంది. ఆమెకి నా పరిస్థితి చాలా జాలి కలిగించిందన్నది నిశ్చయం. ఆమె చాలా సున్నిత

మైన వ్యక్తి. ఇతరుల బాధల్ని సహించలేదు. ఆమె నా దుసితిపట్ల ఆసక్తి కనబరుస్తోంది. అది నా కెలాటి ప్రయోజనాన్ని చేకూరుస్తుందో వేచి చూడాలి.

మర్నాడు ఉదయం ఆమె రమ్మన్న సమయానికె వెళ్ళాను. చిత్ర అక్కడే వుంది. ఈ దిష్టిబొమ్మ పీడ యెలా విరగడవుతుందా అని ఆలోచించాడు. రాణి వాసంలో చెలికత్తెలా విమల నీడంటి వుంటోంది.

"కూర్చోండి, కాఫీ తెప్పిస్తాను" అంది విమల.

"ఫరవాలేదు. ఇప్పుడే తాగి వస్తున్నాను" అని అన్నాను.

ఆమె సూటిగా చూసి "ఒక్కమాట చెప్పనా?" అంది.

"చెప్పండి" అన్నాను సందేహిస్తూ.

"మీ వెధవ ఫరవాలేదును తీసి ఫర్లాంగు దూరాన విసరండి! మొహమాటం ఎగిరిపోతుంది" అందామె.

నవ్వాను. ఆమె అంత చొరవ తీసుకొని చెప్పినందుకు ఆశ్చర్యపడ్డాడు. ఆమె రాజుని కేకేసి కాఫీ తెమ్మంది. చిత్ర నన్ను తదేకంగా చూస్తోంటే కసిగా పళ్ళు నూరాను.

కాఫీ లొచ్చాక తాగుతూ విమల కబుర్లు ప్రారంభించింది. అవేమీ ఊసుపోక కబుర్లు కావు.

ఆమె నన్ను దగ్గరి మనిషిగా భావించి తన బాధ్యతల్నీ, వ్యవహారాల్నీ అరమరికలు లేకుండా చెప్పుకు పోతోంటే, వింటూ విస్తుపోసాగాను.

ఆమెకు తలిదండ్రులు లేరు. తోబుట్టువులు లేరు. తండ్రి గొప్ప పారిశ్రామికవేత్త. సంవత్సరం క్రితం గతించాడు. విజయవాడలోని అతి పెద్ద ఫుట్‌వియర్ కంపె

నీల్లో అతనిది ఒకటి. దానికి దేశవ్యాప్తిగా గుర్తింపు వుంది. మద్రాసు, కర్ణాటక, ఒరిస్సా మొదలైన పొరుగు రాష్ట్రాల్లో మంచి వ్యాపారముంది. అతనికి దగ్గరి బంధువు లెవరూ లేరు. దూరపు బంధువులకి కంపెనీలో ఆశ్రయం లేదు. అతను బంధువులూ, స్నేహితులపట్ల చాలా కఠిన వైఖరి నవలంబించి దూరంగా వుంచాడు.

చనిపోతూ యావదాస్తినీ ఏకైక వారసురాలైన కుమార్తెకు వదిలాడు. విజయవాడలోనూ, రాష్ట్రంలో పలుచోట్ల వున్న ఆస్తులతో బాటు, కలకత్తాలో ఒక రెండంతస్తుల మేడా, పదహారంతస్తుల అపార్ట్‌మెంట్స్ బిల్డింగ్ కూడా వున్నట్టు విమల చెప్పింది.

ఆ ఇంట్లో ఆమె ఒంటరిగా వుండలేక తోడుగా చిత్రను వుంచకొంది. ఇద్దరూ కల్సి డిగ్రీ వరకు చదివారు. చిత్ర ఏదో నామ మాత్రపు ఉద్యోగం చేస్తోంది. ఆమె చక్కటి సలహాలిస్తుందనీ, తన వ్యవహారాల్లో సహాయ పడుతుందనీ, చాలా నమ్మకమైనదనీ విమల చెప్తున్నప్పుడు చిత్ర ఉబ్బితబ్బిబ్బవుతూ వంకర్లుపోతూంటే, అమాంతం లేపి వరండాలోకి విసరాలనిపించింది.

ఆ ఇంట్లో వీళ్ళిద్దరూ గాక ఇంకా తోటమాలి రాజు, వంటమనిషి కాంతం వుంటున్నారు. కంపెనీ వ్యవహారాలు విమల పైపైన చూసుకొంటున్నా, వాటిలో క్రియాత్మక నిర్ణయాలు తీసుకొనేది మేనేజర్ సంజీవరావు.

"అతనంటే నాకు చాలా యిష్టం, విశ్వాసం. ఇరవై యేళ్ళుగా వుంటున్నాడు—" అని ముగించింది విమల.

నేనలాగే మౌనంగా కూర్చున్నాను.

ఆమె నన్నూ, చిత్రనూ మార్చి మార్చి చూసింది. మా

యిద్దరి మధ్య అగాధాన్నే మె పసిగట్టి వుండొచ్చు. కానీ దాన్ని పట్టించుకొనే స్థితిలో లేదు.

"మీ గురించి నాకు యింకా పూర్తిగా చెప్పలేదు!" అందామె మాతాతుగా.

తేరుకొని నవ్వాను.

"మళ్ళీ మర్చిపోయారా? నా గురించి మీ కెందుకంత ఆసక్తి? చూడండి విమల, సీరియస్‌గా చెప్తున్నాను. నా గురించి తెలుసుకుంటే మీకు మనశ్శాంతి మిగలదు! ఇప్పటికే మీకు తలకు మించిన బాధ్యతలు, వ్యవహారాలు వున్నాయి. నా గురించి అనవసరంగా ఆలోచించి మనసు నెందుకు పాడుచేసుకొంటారు? నేను మీకు సహాయ పడ్డాను. రక్షించాను—సరే-అది మగవాడిగా నా ధర్మం. దాన్ని మీ రెందుకు సీరియస్‌గా తీసుకొని ప్రత్యుపకారం చేయాలనుకొంటున్నారు? ఇది నాకు నచ్చదు!"

ఆమె బిత్తరపోయి చూస్తోంది.

నేను మళ్ళీ అన్నాను, "అలాటి ఆలోచన మానుకోండి! నే నిప్పుడిప్పుడే కోలుకొంటున్నాను. నా గతాన్ని తవ్వకండి! మీ రేదో ఋణం అంటున్నారు, అదేమీ నాకొద్దు. నేను మీ నుంచి ఏ ప్రతిఫలమూ ఆశించి సహాయపడలేదు. నన్ను వంటరిగా వదలండి మర్చిపొండి!"

తటాలున లేచి నిలబడ్డాను.

ఆమె కంగారుగా అర్చింది, "కిరణ్! కూర్చోండి! ప్లీజ్! మిమ్మల్ని బాధపెట్టడం నా అభిమతం కాదు. మీరు— నేను—మీతో నేను స్నేహమాశించగూడదా?"

గిరుక్కున ఆమెని చూశాను. ఆమె ముఖం కళా విహీనంగా వుంది!

"అంతే—నా మనసులో మాట చెప్పేశాను! మీ

రంగీకరిస్తే రాత్రి భోజనానికి రండి—" ఆమె విసురుగా లేచి వెళ్ళిపోయింది. చిత్రా, నేనూ చూసుకున్నాం. నా కక్కడ వుండాలనిపించలేదు. వెంటనే బయట కొచ్చేశాను.

నా కంతా అయోమయంగా వుంది!

నాతో స్నేహం! నా గుండె వేగంగా కొట్టుకుంది. మా మధ్య ఇంత సులువుగా అది మొలకెత్తుతుందా? ఏమో! విచిత్రంగా వుంది!

నా లాటి అనామకుడు ఏదైనా ఆపదలో అదుకుంటే కృత్రిమమైన నవ్వొకటి యిలా పారేసి, ఖరీదైన భాషలో థాంక్స్ చెప్పి తలెగరేసి వెళ్ళిపోయే ధనవంతుల అమ్మాయిల్నే చూశాను గానీ—విమలలాటి సీరియస్ మనిషిని, సెంటిమెంటల్ మనిషిని నే నెక్కడా చూడ లేదు.

నే నామెను ఆకర్షించాను.

అవును! నాలో ఏదో ఆమె నాకర్షించింది. ఆకర్షణ లేనిది ఏ బంధమూ లేదు! విమల నన్నాకర్షించింది, నేను విమల నాకర్షించాను,

డామిట్, అది నా మూర్ఖత్వమవుతుంది!

ఆ రాత్రి భోజనాలయ్యాక విమలా నేనూ లాన్‌లో కూర్చున్నాం.

అప్పుడు చిత్ర గురించి నే నామెకు రహస్యంగా చెప్పాను. ఆమె అంటే నాకిష్టం లేదనీ, నాకు దూరంగా వుంచమనీను. ఆమె ఆశ్చర్యంగా చూసింది. కానీ కారణ మడిగే మూడ్‌లోలేదు. ఆమెకు నాతో ఏకాంతం ముఖ్య మని గ్రహించాను.

నేనన్నాను. "నాకే ప్రత్యేకతా లేదు! నాతో మీరు

స్నేహం కోరడం అదృష్టంగా భావిస్తాను. కానీ, దాన్ని యింతలోనే జారవిడుచుకుంటున్నందుకు విచారంగా వుంది...."

"అంటే ఏమిటి?"

"చూడండి, విమల. నేను ఉద్యోగం మానేసి ఊరికే తిరుగుతున్నాను. ఈ మూడ్నెల్లు వూరూరా తిరిగి స్నేహితుల దగ్గర గడిపాను. ఇక్కడా స్నేహితుడి దగ్గర వుంటున్నాను. కాని అతను మాత్రం ఎంతకాలం సహిస్తాడు? త్వరలో నేనిక్కడ నుంచి వెళ్ళక తప్పదు."

ఆమె హతాశురాలైంది.

"ఓహ్, లేదు కిరణ్! మీరు వెళ్ళకూడదు!"

"సారీ, మిస్. క్షమించాలి."

ఆమె చాలాసేపు చలనం లేకుండా వుండిపోయింది. పొంగుకొస్తున్న ఆవేశాన్ని పెదిమలతో అదిమిపట్టింది. ఆమెకూ నాకూ మధ్య నిశ్శబ్దంలో నైట్‌క్వీన్ పరిమళం వింత వాతావరణం సృష్టిస్తోంది.

"లేదు కిరణ్, మీరు వెళ్ళరు! ఇక్కడే వుంటారు! నాతోనే! మిమ్మల్ని విడిచి వుండలేను! ఇన్నాళ్ళూ నేను వెతుకుతున్నది మీలో వుంది! అది—అది-ఓహ్ మనసులో భావాల్ని నేను దాచలేను! ఇట్టే బయటపెట్టేస్తాను! నా కానిగ్రహంలేదు, నన్నర్థం చేసుకోండి."

ఆమె నేననుకున్నంత తీవ్రంగానే నన్ను కాంక్షిస్తోందని గ్రహించి, "సరే, అలాగే కానివ్వండి! కానీ ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. ఇంకెప్పుడూ నా గతాన్ని గుర్తుచేయకండి! మరోసారి మీరు రుణం అన్నారంటే రైలెక్కేస్తాను. ఏమంటారు?"

ఆమె కుదుటపడింది. తేలిగ్గా నిట్టూర్చి, ఓ సారి కళ్ళు

మూసుకొని తెరిచింది.

"అలాగే కిరణ్, గుర్తు చేయను. మీ స్నేహాన్ని వదులుకోను."

నవ్వుకున్నాను.

## 3

అది మొదలు—మా ఇద్దరి మధ్య స్నేహం గాఢంగా పెనవేసుకొంది.

ఆమె నన్ను విడిచి వుండలేదన్నది విదితమే, కానీ నే నామెని విడిచి వెళ్ళడం కూడా విచిత్రంగా సాధ్యం కాదనిపిస్తోంది!

ఇక్కడ—వలచిన వనిత దగ్గర స్నేహం, ఆదరణ, ఔదార్యం, యివన్నీ అనుకోని వరాల్లా లభిస్తోంటే కాదని దూరంగా పారిపోయే మూర్ఖుడెవరు?

కాబట్టి నేనిక్కడే వుండదల్చుకొన్నాను. లైఫ్‌లో థ్రిల్ వుండాలి. ఈ మూడు నెలల బైరాగి బ్రతుకు ఇహ చాలు!

విమలతో కాలక్షేపం ఎంత మనోహరంగా వుంటుందో ఆ భాగ్యం పొందిన వారికే తెలుస్తుంది! ఆమె కబుర్లకు అంతులేదు. అవేమీ ఊసుపోక మాటలు కావు. భవిష్యత్ కార్యక్రమాల గురించీ, కంటున్న కలల గురించీ ఆసక్తి కరంగా చర్చిస్తూంటుంది ఎప్పుడూ.

ఇది ఆమె నాకందిస్తున్న కాలక్షేపం.

ఇక నేను—నాకు కబుర్లు చెప్పడం రాదు. వినడంలో నే ఆసక్తి. అందువల్ల వివిధ సంగీత బాణీల్ని స్ప్లైసింగ్—మిక్సింగ్ ద్వారా టేపుల్లో ఒకచోట చేర్చి, వింత ధ్వనుల్ని సృష్టించి ఆమె మెప్పు పొందడం నా ప్రియ మైన హాబీ. ఫియట్‌ను విమానంలా తోలి ఆమె నదరగొట్టడం-

కేరమ్స్‌లో ప్రతిసారీ చిత్తుగా ఓడిపోవడం— మొదలైనవి.

ఇలా 15 రోజులు సాగి మా స్నేహంలో క్రమంగా 'మీరు' నుంచి 'నువ్వు'లోకి దిగాం. అందుకామే ప్రోత్సహించింది. అయితే చిత్ర తత్వం ఏమిటో నాకర్థం గాలేదు! మమ్మల్ని చూసి అసూయ చెందుతోందను కొన్నాను. కాని అలాటిదేమీ లేదు. ఎంతో సౌమ్యంగా కన్పించసాగింది.

రాజు ఒక్కడే నాకు బద్ధశత్రువులా దాపురించాడు! నేనంటే అతనికి రోజు రోజుకీ అయిష్టత పెరిగిపోతోంది. విమలకు అతనేం నూరిపోస్తాడో నాకు తెలుసు. కానీ అవేమీ ఆమె పట్టించుకొనే దశలోలేగు.

ఈ స్నేహం ఎక్కడికి దారి తీస్తుందో నాకు తెలుసు. ఇంకా దీన్ని స్నేహం అనకూడదు. ఇప్పుడిది మమ్మాటికీ స్నేహం కాదు. ప్రేమ!

ఏదో ఒకనాడు—నా అంచనా ప్రకారం అతిత్వరలో ఇది ముసుగు తోసేసి బయటపడుతుంది!

మరో వారం గడిచాక ఆమె మొదటిసారిగా కంపెనీకి తీసికెళ్ళి యంత్రాల్నీ, పనివాళ్ళ నేర్పరితనాన్ని చూపించింది.

ఆమె మగవాడ్ని వెంటబెట్టుకు రావడం అదే మొదటిసారి కాబోలు—అంతా విచిత్రంగా చూడసాగారు. కొందరికి అయిష్టం, కొందరికి ఆశ్చర్యం కలిగాయి. ముఖ్యులైన వాళ్ళకు ఆమె నన్ను పరిచయం కూడా చెయ్యలేదు.

కానీ మేనేజర్ మాత్రం ఆమెని ప్రక్కకు పిల్చి వేగంగా ఏదో మాట్లాడాడు. విమల కూడా మేదో

మాట్లాడింది. మాట్లాడిందనడం కన్నా, వాదించిందనడం బాగుంటుంది. మేనేజర్ తీవ్రంగా అసంతృప్తి వెలిబుచ్చాడు. నేనంటే అతని కిష్టంలేదని—ఎవరికీ వుండదని నాకు ముందే తెలుసు.

మరో పదిహేను రోజులు యథేచ్ఛంగా తిరిగాం. కాని ప్రతిదానికీ ఆమే ఖర్చుపెట్టడం నా వ్యక్తిత్వాన్ని నగ్నంగా నిలబెట్టసాగింది. ఈ ప్రేమ ఎంత ఖరీదైనదో అప్పుడుగానీ గ్రహించలేకపోయాను.

నేనామె కే విధంగానూ తగను గాక తగను! ఇది ఆమె యెందుకు గ్రహించడంలేదు? ఏమిటి ఉద్దేశం? ఏ అర్హతా, ఆర్థిక హోదా లేని నన్ను కట్టుకొని విమర్శలని ధైర్యంగా ఎదుర్కోవాలనా. లేక తన వంటరి జీవితానికి కొరవడ్డ థ్రిల్ కోసం కొన్నాళ్ళు నన్నో మరబొమ్మలా వాడుకొని విసిరేయాలనా?

ఆమెని పరీక్షించాలి! అనవసరంగా నా కాలం వృథా చెయ్యడమెందుకు?

ఆ ఆలోచనతో నేనామెకు హఠాత్తుగా రెండు రోజులు కన్పించడం మానేశాను. దాని ప్రభావం ఆమె మీద ఎలా వుంటుందో తెలుసు. కానీ అదెలాటి ఫలితాన్నిస్తుందో చూడాలి!

మూడవరోజు ఆమె గాంధినగర్‌లో సాయంత్రం కార్లో పోతూ కన్పించింది. ఆమే నన్ను చూసింది. నేను ఆమెని చూశాను.

"కిరణ్!" అర్చిందామె గొంతు చించుకొని, "కిరణ్!"

దగ్గరికెళ్ళి ఆగాను, "ఓహ్, విమలా! నువ్వా!" నవ్వాను.

ఆమెని సూటిగా చూశాను. ఆమెమీద నేనాశించిన ప్రభావమే పని చేసిందని ముఖం చెప్తోంది. పూర్ గర్ల్! ఎంత తపించిపోయిందో!

"ఇలా రా! కారెక్కు!" సుళ్ళీ అంటావామె, "చిత్రా! నువ్వు దిగి టాక్సీలో వెళ్ళు! నేను తర్వాత వస్తాను."

చిత్ర మాట్లాడకుండా దిగింది. నేనెక్కి కూర్చున్నాను. విమల వెంటనే స్టార్టుచేసి పోనిచ్చింది.

"ఓహ్, కిరణ్! ఎక్కడున్నావ్?"

"ఇక్కడే—చెప్పకుండా పారిపోను!"

"మరి కన్పించలేదేం?"

"ఓ, అదా. దేవుడు జబ్బు అనే వరమొకటి ఇచ్చాడుగా! అది నేను పొందాను."

ఆమె ఉలిక్కిపడి చూసింది. "ఏమైంది నీకు?"

"ఏదని చెప్పాలి? జలుబు, దగ్గు, తలపోటు. ఇక్కడి నీళ్ళు పడ్డంలేదు."

"మరి నాకెందుకు కబురు చేయలేదు?"

"నిన్ను కంగారుపెట్టడం ఇష్టంలేక!"

ఆమె గిరుక్కున తిరిగి కఠినంగా అంది, "చూడు, కిరణ్! నీ ప్రవర్తన నేను బాగా గమనిస్తున్నాను. నువ్వు లోలోన ఇన్ఫీరియారిటీ ఫీలవుతున్నావు. అవునా?"

"దేనికి? నాకోసారి పెళ్ళయింది. ఆడవాళ్ళంటే బెరుకులేదు."

"నీ బెరుకు అదికాదు. నాకు తెలుసు. నా అంతస్తు నిన్ను భయపెడుతోంది! నువ్వు దూరంగా వుండాలనుకొంటున్నావు. కానీ నీలా నేను చూడ్డంలేను కిరణ్. సినిమాలో హీరోయిన్‌లా నీ అందం, బలపరాక్రమం

చూసి వశం కాలేదు! నీ ఆత్మసౌందర్యం చూశాను. అదే నన్నాకర్షించింది! నీ నిష్కపటత్వం, నిదానస్వభావం, అవగాహనశక్తి నన్ను లొంగదీసుకొన్నాయి. వాటి ముందు నా అంతస్తులెక్కడ! అవి అశాశ్వతం. ఇవాళ వుండొచ్చు రేపు పోవచ్చు. కానీ మనిషిలో స్వతహాగా కొన్ని సుగుణాలుంటాయి చూశావా—అవి శాశ్వతంగా అలాగే వుండిపోతాయి. చెక్కుచెదరవు. అవే మనల్ని డబ్బుకంటే పరువుగా నిలబెడతాయి.”

“సారీ, విమలా! నువ్వేం చెప్తున్నావో అర్థంగావడం లేదు.”

ఆమె నన్ను చూసి నిట్టూర్చింది “అర్థంగాలేదా? సరే, అయితే విను! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు, నేను నిన్ను ప్రేమిస్తున్నాను, చాలా సింపుల్, అంతే! ఇందులో మనకేదీ అడ్డులేదు. అర్థమైందా?”

“విమలా!” అన్నాను — ప్రేమనగర్‌లో నాగేశ్వర్రావులా.

“మనం పరస్పరం ప్రేమించుకొంటున్న విషయం ఒప్పుకొంటాను. కానీ—దాని పరిణామాలేమిటో ఆలోచించావా? నువ్వు అందరి విమర్శలకి గురవుతావు! అది నీ క్షేమానికి మంచిదికాదు! అందుకే జంకుతున్నాను.”

“యూ సిల్లీ! నేనవన్నీ ఆలోచించాను. ఈ ప్రేమ వివాహాలంతే! ముందు అందరి ద్వేషాన్ని కోరుతాయి—తర్వాత హర్షాన్ని పొందుతాయి. నువ్వు ఏమీ బెంగ పెట్టుకోకు! అంతా సవ్యంగా జరుగుతుంది.”

“నేను బాగా ఆలోచించి చెప్తాను.”

“ఏమాలోచిస్తావ్? నీ భార్య చావు నిన్ను క్రుంగదీసింది. కోలుకోలేకపోతున్నావు. భవిష్యత్తును చీకటి

మయం చేసుకొంటున్నావు. తోడు కావాలి. అప్పుడు గాని బాగుపడవు.

అలాగే నేనూ ఒంటివాన్ని. నాకెవరూ లేరు. నేను చిటిక వేస్తే వందమంది ధనవంతుల అబ్బాయిలు క్యూ కట్టి నిలబడతారు. కానీ వాళ్ళని నేను నమ్మలేను. నా డబ్బంతా నెల తిరక్కుండా తూర్పార బెట్టవచ్చు! మనకి సరిపడ మన స్తత్వం గలవాళ్లు లభించడం ఒక అదృష్టం. నాకు నువ్వు దొరికావు. నువ్వు తప్ప మరొకరితో బ్రతకడం నాకు సాధ్యం కాదు. మనిద్దరం కలిసి కృషి చేస్తే మంచి ఫలితాలు సాధించగలం. ఏమంటావ్?"

నేలి మాట్లాడలేదు. ఆమె మళ్ళీ అంది.

"అంతేకాదు కిరణ్! పెళ్ళయాక నా యావదాస్తీ నీ పేర్న వ్రాసేయాలనుకొంటున్నాను. అప్పుడుగాని నీలో డబ్బులేనివాడివనే భావం తొలగిపోదు."

అదిరిపడి చూశాను.

"అవును. నా బాధ్యతలన్నీ దించుకొంటాను. వాటి నింకా మోయలేను. నువ్వు చదువుకొన్నావు, టాలెంట్స వున్నాయి. వ్యవహారాలన్నీ నిశ్చింతగా నీకొదిలేసి తప్పుకొంటాను. నాకు మనశ్శాంతి కావాలి కిరణ్. అది నీ సన్నిధిలోనే నాకు లభిస్తుంది."

"నువ్వు త్వరపడుతున్నావు, విమల!"

"లేదు, బాగా ఆలోచించాను. చిత్రతో కూడా మాట్లాడాను. ఈ పెళ్ళికి ఆమే ప్రోత్సహించింది. ఆమె సలహా నేను తప్పకుండా పాటిస్తాను కిరణ్!"

కాస్సేపు ఆలోచించి అన్నాను. "సరే విమల! నువ్వు అంతగా చెప్తుంటే ఒప్పుకొంటాను, కానీ నాదొక షరతు."

"చెప్పు."

"చిత్రను ఇంట్లోంచి పంపెయ్యాలి."

"ఎందుకు?"

"నీకు తెలుసు. ఆమె అంటే నాకిష్టం లేదు."

"ఎందుకు లేదు కిరణ్? చెప్పు! దేనికి నచ్చదు?"

"స్పష్టంగా చెప్పలేను.... కొన్నిసార్లు అయిష్టం వర్ణించడానికి క్లిష్టంగా వుంటుంది. ఆమె చేష్టలు నాకు నచ్చవు అంతే!"

"ఆమె నాతో మాదేళ్ళుగా వుంటోంది కిరణ్! చాలా సహాయం చేసింది."

"అయితే నేనేం చెయ్యను? నీకిప్పుడు కావల్సింది చెలికత్తెనా? చెలికాడా?" అన్నాను విసురుగా.

## 4

అలా మా వివాహం వారం రోజుల తర్వాత కలకత్తాలో రహస్యంగా జరిగింది. దాని గురించి విమల తెలియనివ్వలేదు — కలకత్తాలో ఆమె లాయర్‌కూ, నల్గురు సాక్షులకూ తప్ప.

మేం పదిహేను రోజులు హనీమూన్ ముగించుకొని వచ్చాక విజయవాడలో విమల బ్రహ్మాండమయిన విందు ఏర్పాటుచేసి పెళ్ళి గురించి అందరికీ తెలియపరుస్తుంది. ఇది డైనమైట్‌లా ప్రేలినా, మామధ్య ముందే బంధ మేర్పడి, హనీమూన్ కూడా ముగించుకొన్నాం గనుక మమ్మల్నెవరూ విడదీయలేరు.

అక్కడ విందు ఏర్పాట్లు చిత్ర చేస్తోంది. అదొక్కటే ఆమె విమలకు చేసే చివరి సహాయం. ఆ తర్వాత బెడ్డింగ్ సరుకొని వెళ్ళిపోతుంది.

రిజీస్ట్రార్ ఆఫీసు నుంచి మేం తిన్నగా ప్రఫుల్లచంద్ర

స్ట్రీట్‌లోని ఆమె బంగళా కెళ్లాం. అక్కడ అతిథులకి చిన్న సైజు పార్టీ ఇచ్చి సాగనంపాం. ఇక మాకు పది హేను రోజులు కావలసినంత స్వేచ్ఛ.

విమల ఎక్కడెక్కడ తిరగాలో ప్రోగ్రాం ముందే తయారు చేసింది. నా కందులో ఆసక్తి లేదు. ఆమెతో జీవితాన్నూహించుకోవడంలోనే తీరిక దొరకడంలేదు.

నాలుగు రోజులు కలకత్తాలో కాలం తెలియకుండా దొర్లిపోయాయి. బంగళా వదిలి ఎక్కడికి వెళ్ళలేదు. ఆమె మరీ బలవంతం చేస్తే ఆమె 16 అంతస్థుల ఫ్లాట్స్ బిల్డింగ్‌ని మాత్రం చూశాను. విమల దానిమీద ఆదాయ వివరాలను చెబుతోంటే, దాన్ని అమ్మేస్తే ఎంత వస్తుం దని అడిగాను. ఇప్పటి విలువనిబట్టి సుమారు డెభ్భై లక్షలని చెప్పింది. డెభ్భై లక్షలు! నా గుండె ఆగి నట్టయింది.

ఆమె డబ్బు గురించీ, ఆదాయం గురించీ ఆలోచి స్తోంటే మతి పోతోంది. కలకత్తాలో ఇలాటి ఆలోచ నలు హనీమూన్‌కు భంగం కలిగించడం భరించలేక పోయాను. వెంటనే స్థలం మారాలి.

ఆ తర్వాత ఢిల్లీ వెళ్ళాం. అక్కడ రెండు రోజు లున్నాం. అశోకా హోటల్ అందించిన సౌఖ్యాలన్నీ అనుభవించాం. అద్దె కార్లో అక్కడ ముఖ్యమైన స్థలాల్ని చూడ్డమేగాక, ముఫ్ఫయ్ మైళ్ళ దూరాన ఆగ్రా వెళ్ళి అక్కడ అందరూ చూసేదే చూశాం. మధుర రిఫైనరీ గురించి ప్రస్తావించి విమల తాజ్‌మహల్ భవిష్యత్తుపట్ల ఆందోళన వ్యక్తం చేసింది.

ఆ తర్వాత వారం రోజులు ప్రకృతి స్థలాలకై కేటా యించిందామె. దాని ప్రకారం డార్జిలింగ్, సిమ్లా,

కొడైకెనాల్ మొదలయిన చోట్ల గడిపి చివరికి నాగార్జున సాగర్ చేరాం.

ఇక్కడ ఒకరోజు గడిపి విజయవాడ వెళ్ళిపోవాలి. ఆ మరుసటి రోజు అక్కడ రిసెప్షన్ వుంది. ఆ తర్వాతి రోజు విమల ఆస్తినంతటినీ నా పేర్న మారుస్తుంది.... ఈ ఆలోచనకి ప్రతిసారి నా గుండె భరించలేనంత వేగంగా కొట్టుకొంటోంది.

విమల! ఆమెకెంత తెగింపు! నా మీద ఎంత నమ్మకం! చుట్టూ సమాజపు ఎత్తిపొడుపుల్ని ఎలా ఎదుర్కోవాలని ఆమె ధైర్యం! ఆమె లోకం గురించి ఆలోచించడం లేదు. తన గురించి ఆలోచిస్తోంది. తను నా భార్య. నాలో న్యూనతా భావాన్ని వెళ్ళగొట్టి, తనమీద సర్వాధికారాలూ నాకిచ్చి, నా చేత పాలింపబడ్డంలోనే ఆమెకు తృప్తీ, సంపూర్ణ జీవితమూ సిద్ధిస్తాయి కాబోలు!

సాగర్ డామ్, కొండమీద మ్యూజియం, మాచర్ల దగ్గర ఎత్తిపోతల్ని చూశాక తిరిగివచ్చి విజయవిహార్‌లో బస చేశాం.

ఈ రోజుతో హనీమూన్ ముగిసింది. ఇక రేపటినుంచి మరో ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నాం. అక్కడి పరిస్థితులెలా వుంటాయో వూహిస్తూంటే నా గుండె అదురుతోంది.

"కానీ విమలా, మీ వ్యాపారం గురించి—ఏ వ్యాపారం గురించీ నాకేమీ తెలియదు! వాటిలో మెళుకువలు, ముందు చూపూ నాకసలు లేవు! నీ బాధ్యతలు నా మీద వేసి నిర్బంధించడం చూస్తే నాకేదో భయంగా వుంది.... నావల్ల ఏదేనా విపత్తు సంభవిస్తే?" అన్నాను. చాలాసేపు మేం ఒకరిప్రక్క నొకరం సీలింగ్

ఫ్యాన్‌ను చూస్తూ గడిపాక ఆమె తేరుకొని చిన్నగా నవ్వింది.

"ఏం విపత్తు సంభవిస్తుంది, కిరణ్? వ్యాపారం దివాలా తీస్తుందా? లేక డబ్బు నీ స్వంతమైందని మితి మీరిన ఖర్చులకీ, అలవాట్లకీ బానిస అయి మొండిచేతులు చూపిస్తావా?" నవ్విందామె. "మొదటిది జరగదు. వ్యాపారం పూర్తిగా నీ చేతిలో వుండదు. పైపైన వ్యవహరిస్తావు! సమర్థుడయిన మేనేజర్ వున్నాడు. క్రమంగా నువ్వన్నీ నేర్చుకుంటావు. నా కా నమ్మక ముంది. ఇక రెండవది—అది నీ నైజానికి విరుద్ధం. ఈ సిగరెట్లు తప్ప మరో దురలవాటు నీ దరికి రాదు!"

ఆమె మాటలు ఇంకా పూర్తికాక ముందే ఫెళ ఫెళ మంటూ కిటికీ అద్దం ఒక్కసారిగా పగిలింది. ముక్కలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఏర్పడ్డ రంధ్రంలోంచి ఏదో గుండ్రటి వస్తువు విసురుగా వచ్చి ఆమె నుదుటికి కొట్టుకొంది.

ఆమె భయంతో అర్చింది. నేను చలనం లేకుండా వుండిపోయాను. కాళ్ళూ చేతులు చల్లబడ్డాయి. రక్త ప్రసరణ ఆగినట్టయి నోరు తడారింది.

"కిరణ్!" అర్చిందామె నుదురు పట్టుకొని, "ఓహ్, ఏమిటిది!"

ఆమె అరుపుకి లేచి నిటారుగా కూర్చున్నాను. ఆమె చేతిలో ఏదో కాయితపు వుండ వుంది. ఆమె కళ్ళలో భయం చూసి నా భయం యింకా ఎక్కువైంది. ఆ వుండ అందుకొని విప్పాను. లోపల రాయి వుంది.

ఇద్దరం అర్థంగాక చూసుకొన్నాం.

"ఇది—దీన్ని—ఎవరు విసిరారు?" అస్పష్టంగా

గొణిగాను.

"కాయితంలో చూడు—ఏదో వ్రాసి వుంది!" ఆర్చిందామె.

ఛటుక్కున కాయితాన్ని పూర్తిగా విప్పి చూశాను. అందులో ఏదో వ్రాసి వుంది. అతిప్రయత్నంమీద దృష్టి సరిగా నిలిపి చదవగల్గాను.

అందులో ఇలా వుంది:—

**"నన్ను తిరస్కరించావు—**
**తిరస్కారం నీకు చాలా చౌక**
**కానీ నా ప్రతీకారం చాలా ఖరీదైనది, విమలా!**
**—రామారావు."**

## 5

మర్నాడు మేం విజయవాడ తిరిగి వెళ్తున్నప్పుడు ఎక్కువ మాట్లాడుకోలేదు. రాత్రి సంఘటన విమలను చాలా కృంగదీసింది. ఓ పట్టాన కోలుకోలేకపోతోంది. అందుకు నా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

మామూలుగానైతే రామారావు ఎవరో నేను అడిగి వుండేవాడిని కాదు. ఎవరి గతంలోనూ నాకు కుతూహలం లేదు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. విమల గతం యిప్పుడు ప్రాణాంతకంగా పరిణమించింది. ఆమెనుంచి వివరాలన్నీ రాబట్టాను.

ఈ రామారావు చదువుకొనే రోజుల్లో విమలను వేధించేవాడు. అంటే అల్లరి పెట్టడం కాదు గానీ, తన్ని ప్రేమించమని గౌరవంగా విసిగించేవాడు. అతనూ నా లాగే ఆమె అంతస్తుకి సరితూగడు. అయినా ప్రేమను సీరియస్ గా తీసుకొన్నాడు.

విమల తిరస్కరించింది. ఓర్పు నశించి ఓ రోజు నల్లూర్లో

అతని చెంప వాయించింది. దాంతో అతనికి కక్ష పెరిగింది. అదేరాత్రి ఇంట్లో జొరబడి దౌర్జన్యం చేస్తే ఆమె తండ్రి అరెస్టు చేయించాడు. ఇది జరిగి సంవత్సరన్నరయింది.

అప్పుడతనికి పోలీసులు మంచి ట్రీట్ మెంట్ యిచ్చి వుండాలి—ఆ తర్వాత ఆమెకేసి కన్నెత్తి చూళ్లేదు. కానీ పరీక్షలు వ్రాసేసి వెళ్తూ సమయం వచ్చినప్పుడు సెటిల్ మెంట్ చేసుకొంటానని హెచ్చరించాడు. అప్పటి నుంచీ అతను కన్పించలేదు. ఎక్కడ వున్నాడో ఆమెకు తెలియదు.

కాని రాత్రి సంఘటన చూస్తే అతను మమ్మల్ని కనిపెడ్తున్నాడని అర్థమవుతోంది. అతను తిరిగి వచ్చాడు ఇచ్చిన మాట నిలబెట్టుకోడానికి.

ఇదంతా విని తేలిగ్గా నవ్వేసాను. ఆమెకు ధైర్యం చెప్తూ, "నువ్వతని బెదిరింపుల్ని లెక్క చెయ్యాకు. కథలు చదివీ, సినిమాలు చూసీ ఇలా తయారవుతున్నారు! విజయవాడ వెళ్ళి పోలీసు రిపోర్టిద్దాం" అన్నాను.

మేం విజయవాడ వెళ్ళేసరికి మధ్యాహ్నమైంది. అక్కడ చిత్ర ఏర్పాట్లన్నీ నిరాడంబరంగా పూర్తి చేసింది. ఆహ్వాన పత్రికలు అచ్చు వేయించి పంపింది. ఇంటిముందు షామియానా, ఓ వంద కుర్చీలు వేయించి, లైట్ టిఫిన్, కాఫీలు సిద్ధం చేస్తోంది.

మమ్మల్ని పెద్ద ఆరిందాలా ఆహ్వానించి నాటక ఫక్కీలో దీవించింది. పని వాళ్ళు రాజు, కాంతం మమ్మల్ని చూసి సంతోషించలేదు. ఆముదం తాగిన ముఖాలేసుకుని నిలబడ్డారు.

"రండి, రండి! అక్కగారూ, బావగారూ! మీ ప్రేమ

యాత్ర కమ్మగా సాగిందా?"

చిత్ర మాటలకి నాకు మరీ అసహ్యమేసింది. ఇదెక్కడి వరస!

విమల అంది, "నీ పుణ్యమా అంటూ అంతా బాగానే జరిగిందిగానీ, ఇక్కడ రెస్పాన్స్ యెలా వుంది?"

"గుప్పుమని మంటలు లేచాయి! ఇంకా పూర్తి సమాచారం అందలేదుగానీ, సుమారు ఓ నూటయాభై జీపుల మనోఃమందిరాలు దగ్ధమైనట్టు అంచనా. ముఖ్యంగా మీ రాకెట్—అదెవరు? అదుగో. వచ్చేస్తున్నాడు!" చిత్ర విసురుగా తిరిగి యింట్లో కురికింది.

బయట కారాగిన చప్పుడైంది. మేనేజర్ సంజీవరావ్ దిగి పరిగెత్తి వస్తున్నాడు. విమల నన్ను చూసి తేలిగ్గా నవ్వింది. నాకు భయం పట్టుకొంది.

"విములా! నీకు మతిపోయింది!" అర్చాడతను లోనికొస్తూనే. అతని కళ్ళు నాపై నిప్పులు కురిపించాయి.

విమల నవ్వింది. "పత్రిక పంపింది వచ్చి ఆశీర్వదించమని, తిట్లతో అక్షింతలు వేయడానికాదు!"

"నువ్వు చేసిన పనికి ఆశీర్వదించాలా! మేమంతా ఏమయ్యామనుకొన్నావు."

"మీరంతా కాదు—నాన్న వున్నా యిలాగే చేసేదాన్ని."

"పద లోపలికి! నీతో మాట్లాడాలి!" ఆమె చెయ్యి అందుకొని, నన్ను చుర చుర చూసి ప్రక్క గదిలోకి దూరాడతను.

తలుపులు దఢాలున మూసుకొన్నాయి. లోపల అస్పష్టంగా మాటలు విన్పిస్తున్నాయి. నిస్సత్తువగా సోఫాలో

కూలబడి సిగరెట్ వెలిగించాను.

ఇక ప్రారంభమైంది! సాయంత్రానికల్లా అందరూ దండయాత్ర కొచ్చేస్తారు. ఇల్లు చిన్నసైజు రణరంగంలా మారుతుంది.... వాళ్ళందర్నీ విమల ఎదుర్కోగలదా?

పావుగంట తర్వాత మేనేజర్ చిటపటలాడుతూ బయటికొచ్చాడు. విమల అలసటగా వెనుక వస్తూ అంది, "తిడితే తిట్టావుగానీ, సాయంత్రం పార్టీకి రా! కోపం మనసుకు సంబంధించింది, తిండి కడుపుకు సంబంధించింది. మర్చిపోకు!"

అతను వెళ్ళిపోయాక విమల నాతో అంది: "నువ్వా తన్ని పట్టించుకోకు. సాయంత్రానికల్లా చల్లబడి వస్తాడు."

నేను మాట్లాడలేదు. ఇంతలో చిత్ర వచ్చింది.

"ఏమంటున్నాడు రాకెట్? రోదసీ యాత్ర చేశాడా?"

"అవును. రోదసిలో అన్వేషించేదిలేక తిరిగి వస్తాడులే!" నవ్వింది విమల. ఒక్కసారిగా ఆమె ముఖం వివర్ణమైంది. "చిత్రా! నీకు రామారావు గుర్తున్నాడా?" అనడిగింది చటుక్కున.

చిత్ర ముఖం చిట్లించింది.

"ఏ రామారావు? ఓ, ఆ రోమియోనా! లేకేం?"

"అతనెక్కడున్నాడో తెలుసా?"

"ఏమో, పరీక్ష ప్యాసయ్యాడని మాత్రం తెలుసు. ఎందుకిప్పుడు?"

విమల ఓ క్షణం నన్ను చూసి అంది:

"మళ్ళీ అతను పాత కక్ష గుర్తు చేసుకుంటున్నాడు."

"అంటే?"

విమల ఆలస్యం చేయకుండా సాగర్ సంఘటన వివ

రించి చెప్పింది. చిత్ర ఆశ్చర్యంగా, భయంగా వింది.

"ఇంకా ఆలస్య మేమిటి? పోలీసు రిపోర్టివ్వాలి!" అందామె.

"అదే ఆలోచిస్తున్నాను.... ఇన్స్పెక్టర్ బాజ్జీని పిలుద్దాం. అప్పుడతనే కదూ రామారావుకు చికిత్స చేసింది?" అంటూ విమల ఫోన్ అందుకొని డయల్ చేయసాగింది.

పావు గంటలో ఇన్స్పెక్టర్ బాజ్జీ వచ్చాడు. అతనికి సుమారు నా వయసే వుంటుంది. తెల్లగా ఆకర్షణీయంగా వున్నాడు.

విమల అతనికి నన్ను పరిచయం చేసినప్పుడు వెచ్చటి స్పర్శతో కరచాలనం చేసి, మాటల్లోగాక కళ్ళతో అభినందనలు వ్యక్తం చేశాడు. తేలికపడ్డాను. నేనంటే ఇష్టమున్న వ్యక్తి ఇతనొక్కడు తేలాడు.

విమల సాగర్ సంఘటన అతనికి చెబుతోంది. అతను అంతా శ్రద్ధగా విని భుజాలెగరేశాడు.

"డోంట్ బాదర్! అతనికి మిగిలిన కోర్సు కూడా ఇస్తే మందు సరిపోతుంది. ప్చ్! ఇదివరకే పూర్తి కోర్సు ఇవ్వాల్సింది! కానీ రోగతీవ్రతనుబట్టి ఇవ్వాలికదా? అతనెక్కడున్నా గాలించి వెంటనే ఇస్తాను. రాత్రి సాగర్లో వున్నాడంటే మీ కోసమే వెళ్ళివుండాలి. లేక అక్కడ వుద్యోగం చేస్తున్నాడంటారా?"

"అతని ఉద్యోగం ఎక్కడో నాకు తెలియదు."

"నేను విచారిస్తాను. ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజిలో కనుక్కొంటాను...." అంటూండగా చిత్ర కాఫీ, టిఫిన్ తెచ్చి అతని ముందు పెట్టింది.

ఆ సాయంత్రం ఆరు గంటలకి అతిథుల రాక మొద

లయింది. నన్ను చూసి అందరూ అయిష్టంగా ముఖం చిట్లించుకోసాగారు. నా ముఖంలో గ్లామర్ బోలెడంత వుంది. వీళ్ళకి నచ్చనిదేమిటో అర్థం గావడంలేదు.

మేనేజర్ రావ్ వింత ప్రవర్తన నన్ను కలవరపెట్టింది. విందు ప్రారంభం గాకముందు అతిథుల నుద్దేశించి ఇలా అన్నాడు:

"అమ్మాయి విమల ఇలా అకస్మాత్తుగా, రహస్యంగా వివాహం చేసుకోనడం మిమ్మల్ని నొప్పించి వుండవచ్చు. అందుకు నేను క్షమాపణ కోరుకుంటున్నాను. నా దృష్టిలో ఇది తెలియకుండా, రహస్యంగా జరగలేదు. అంతా నా అంగీకారం మీద నే జరిగింది. అబ్బాయి కిరణ్ కుమార్ అన్నివిధాలా తగిన వరుడు. కొన్ని వివరించలేని ప్రత్యేక పరిస్థితుల్లో వివాహం విషయమై ఇలాటి నిర్ణయం తీసుకోవడం జరిగింది....ఇందులో మీలో ఎలాటి అపార్థాలకి తావుండదని ఆశిస్తున్నాను."

ఇలా రావ్ చెప్పిన మాటలన్నీ వాళ్ళమీద మంచి ప్రభావం కలిగించాయి. అంతా అపోహలు మానేసి ఆనందంగా విందారగించారు. వాళ్ళంతా వెళ్ళిపోయాక రావ్ నన్ను ప్రక్కకులాగి అన్నాడు.

"మిస్టర్! పొరబడకు. ఈ డర్టీ బిజినెస్ నా కసలు నచ్చడం లేదు. అయినా అందరూ విమలని దెప్పి పొడవడం సహించక అలా మాట్లాడాను. నేను కోరుకొనేది ఆమె శ్రేయస్సు. నువ్వింత సులభంగా అందరి మెప్పు పొందానని మురిసిపోకు. నువ్వు వచ్చిన దారినే తిరిగి వెళ్ళే రోజు త్వరలో రప్పిస్తాను."

నవ్వుకున్నాను. నా దారి ముందుకు తప్ప వెనక్కి మళ్ళదు.

ఆ రాత్రి చిత్ర మాట నిలబెట్టుకొని ఇంట్లోంచి నిష్క్రమించింది.

స్నేహితురాళ్ళిద్దరూ కన్నీళ్ళు కార్చారు. ఇలా చేయడం నాకు మనస్కరించకపోయినా, చిత్ర అంటే నాకే తెలియని ఏదో అసహ్యంతో నిర్ణయం మార్చుకో లేకపోయాను. ఆమె వెళ్ళిపోయింది.

పది గంటలకి బాబ్జీ ఫోన్ చేశాడు. రామారావు ఆచూకీ తెలియలేదని చెప్పాడు. ఇక్కడి ఎక్స్ఛేంజిలో అతని రిజిస్ట్రేషన్ లేదట. సాగర్ పోలీసుల్ని కాంటాక్టు చేసినట్టు చెప్పాడు.

ఆ రాత్రి నా కెందుకో ఇదివరకటి రాత్రుల్లా హాయిగా నిద్ర పట్టలేదు. హనీమూన్ రాత్రులెంత మధురంగా గడిచాయి! ఇక్కడేమిటీ మార్పు? నేను పైకి నవ్వుకున్నా, రావ్ మాటలు నాలో బాగా నాటుకుపోయి ఏదో విపత్తును సూచిస్తున్నాయి. నా అసౌఖ్యానికిదే కారణమనిపించింది. అతి ప్రయత్నం మీద నిద్రలో జారుకున్నాను.

ఎంత రాత్రి గడిచిందో తెలియదు, హఠాత్తుగా విమల తట్టి లేపింది.

"కిరణ్, లే!"

ఉలిక్కిపడి లేచాను "ఏమిటి?"

"ఏదో చప్పుడవుతోంది..." అందామె. "విను! ఎవరో నడుస్తున్నట్లున్నారు...."

చెవులు రిక్కించి విన్నాను. నిజమే. బయట అడుగుల చప్పుడు స్పష్టంగా విన్పిస్తోంది.... అవి బాల్కనీలో కొస్తున్నాయి. గదిలో చీకటిగా వుంది. ఒక్క క్షణం ఏమీ పాలుపోలేదు. ఎవరది? రాజు ఇంకా నిద్రపోలేదా?

లేక....మళ్ళీ రామారావు వచ్చాడా?

నా నిద్ర పూర్తిగా ఎగిరిపోయింది.

"కిరణ్!" విమల ఊపిరి బిగించి అంది కిటికీ వైపు చూపిస్తూ.

తల తిప్పి చూశాను....నా వొళ్ళు జలదరించింది. కిటికీ అద్దం మీద బయటి వెలుగు పడుతోంది. ఆ వెలుగులో ఎవరిదో నల్లటి నీడ కన్పిస్తోంది....ఆ ఆకారం రాజుది కాదు.

ఆలస్యం చేయకుండా లేచాను. కిటికీ గడియ వేసుంది. కానీ అద్దం పగలగొడ్తాడేమో? అతని చేతిలో ఏముంది? కత్తి విసురుతాడా?

వెంటనే విమలను బెడ్ మీంచి లాగాను. చప్పుడు కాకుండా బయటికి లాక్కెళ్ళి ప్రక్క గదిలో నెట్టి, "భయపడకు, నీకేక్కడేమీ కాదు. వాడి సంగతి నేను చూస్తాను. లోపల గడియ వేసుకో!" అన్నాను.

విమల వారించింది. నేను ధైర్యం చెప్పి కదిలాను. వేగంగా మెట్లెక్కి డాబా చేరుకొని క్రింద చూశాను. అతనింకా అలాగే బాల్కనీలో నిలబడి వున్నాడు. సిగరెట్ తాగుతున్నాడు.

ఒక్క క్షణం సందేహించి ధైర్యం కూడదీసుకున్నాను. జాగ్రత్తగా పిట్టగోడమీంచి అవతలకి జారి, డ్రైనేజి పైపు పట్టుకొని దిగసాగాను. ఏ చిన్న శబ్దమయినా అతను చూస్తాడు.

మరికొంతలో నేను బాల్కనీలో వుంటాననగా, అతను చటుక్కున తిరిగి కిటికీ తలుపు తట్టసాగాడు.

నేను బాల్కనీలో బోర్లా పడుకుని జాగ్రత్తగా అతని కేసి ప్రాకుతూ వెళ్ళసాగాను. అతనప్పుడు తలుపుని

నెట్టి చూస్తున్నాడు. అతని మరో చేతిలో కత్తిని రుమాలుతో చుట్టి పట్టుకున్నాడు. నా కాయాసం వస్తోన్నా నిట్టూర్పులు బయటికి రాకుండా దిగ మింగుతూ ప్రాకసాగాను.

సరిగ్గా పదడుగుల దూరంలో అతను నన్ను పసి గట్టాడు.

మెరుపులా దూకి కాలితో నా ముఖం మీద తన్న బోయాడు. అప్పుడు నేనెలా రక్షించుకొన్నానో తెలి యదు. క్షణాల్లో అంతా జరిగిపోయింది. విసురుగా వచ్చిన అతని కాలుని బలంగా ఒడిసిపట్టుకొని మెలేసి బోర్లా పడేశాను. చేపలా అతని మీదకి దూకి బల్లిలా కరుచు కున్నాను.

అదని కత్తి తారాజువ్వలా లేచి నా కంఠంలో దూసుకెళ్ళేదే! వెంట్రుకవాసిలో తప్పించుకొని ప్రక్కకు పడ్డాను. అతను తటాలున లేచి ఒక్క ఉదటున బాల్కనీ లోంచి క్రిందకు దూకేశాడు. నేనూ లేచి దూకేయ బోయాను. కానీ జాగ్రత్తపడ్డాను.

విసురుగా మెట్లు దిగి యింట్లో కురుకుతూ "రాజూ! దొంగ! దొంగ!" అని అరుస్తూ తలుపు తీసి బయటకు పరుగెత్తాను. అప్పటికతను గేటు దూకేసి పారిపోతు న్నాడు. నేనూ దూకి వెంబడించాను. కానీ ఆ చీకటి వీధిలో ఎక్కడ కనుమరుగయ్యాడో తెలుసుకోలేక పోయాను.

ఆయాసంగా తిరిగి వస్తోంటే రాజు ఎదురయ్యాడు.

"దొరికాడా?"

"పారిపోయాడు."

"ఇది చూడండి!" అతనో చిన్న పుస్తకం నా

కిచ్చాడు. "గేటు దగ్గర దొరికింది."

గబ గబ దాన్ని తిరగేశాను. అది రామారావు డైరీ. అందులో అతని పూరా అడ్రసూ వున్నాయి. గుంటూరు ఆర్ టీసీలో అతను పని చేస్తున్నాడు.

## 6

ఉదయం తొమ్మిది గంటలకు బాబ్జీ ఫోన్ చేసి గుంటూరులో రామారావు ఇంటికి తాళం వుందని అన్నాడు. అతను బ్రహ్మచారి అనీ, మూడు రోజులుగా డ్యూటీ కెళ్ళలేదనీ, లీవు కూడా పెట్టలేదనీ, అక్కడి పోలీసులు ఇంటిమీద నిఘా వుంచారనీ చెప్పాడు.

రాత్రి సంఘటనతో విమల భయం ఇంకా ఎక్కువయింది. రాత్రంతా ఆమె నిద్రపోలేదు. తనకేదో జరుగుతుందనీ, తనిక బ్రతకదనీ చెప్పి ఏడ్చింది.

ఉదయం బాబ్జీ మాటలు విన్నాక, "కిరణ్! నా కిప్పుడు నమ్మకం లేదు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో వూహించలేను. నేను పోతే నన్ను మర్చిపోవుకదూ?" అంది దిగులుగా.

"అలా మాట్లాడకు విమలా! నీకేమీ కాదు. ఎందుకిలా భయపడుతున్నావు?" అన్నాను.

"నువ్వు నన్నెప్పుడూ—ఎప్పటికీ ప్రేమిస్తున్నావు కదూ?"

"ప్రేమిస్తాను. జీవితాంతం ప్రేమిస్తాను."

"మరొకర్ని ప్రేమించవుకదూ?"

"మరొకర్ని ప్రేమించను."

"ప్రామిజ్?"

"ప్రామిజ్."

ఆమె తేలిక పడింది. "అయితే ఇప్పుడే ఇల్లు నీ పేర

మార్పిస్తాను" అని ఫోనందుకుంది. విస్తుపోయి చూశాను. ఆమె లాయర్‌తో మాట్లాడుతోంది. ఏవేవో సూచనలిస్తోంది. ఫోన్ పెట్టేసి నన్ను నవ్వుతూ చూసి "నువ్విప్పుడీ ఇంటికీ—అన్నింటికీ అధికారివి" అంది.

పది గంటలకి లాయర్ వచ్చాడు. అతడితో గదిలో రెండు గంటలసేపు మాట్లాడిందామె. నేను బయటే వున్నాను. రావ్ మాటలు జ్ఞాపకమొచ్చి అదురు పుట్టింది. ఇప్పుడు విమల చేస్తున్న పని తెలిస్తే అతనెలా రియాక్ట్ అవుతాడు?

లాయర్ వెళ్ళిపోయాక విమల మనసు కుదుటపడింది. అతన్ని గెల్చి విల్లు నా పేర ఏర్పాటు చేశానని చెప్పినప్పుడు నా కళ్ళకు మైకం కమ్మింది.

"విమలా! నువ్వు చాలా సాహసించావు."

"ఇది సాహసం కాదు, కృతజ్ఞత."

"నిన్ను—నిన్నెలా అభినందించాలో తెలియడంలేదు" ఆమెని రెండు చేతుల్లో గట్టిగా బంధించి పెదవుల్ని చుంబించాను.

ఆమె ముఖారవిందం సిగ్గుతో స్నిగ్ధమైంది.

సరిగ్గా 12 గంటలకి బాబీ వచ్చాడు. అతని ముఖం చూస్తే తెలుస్తోంది, అతను మాకెంత సీరియస్‌గా సహాయపడుతున్నాడో!

"కిరణ్, మీరు సాగర్‌లో వున్నట్టు అతనికెలా తెలిసిందో అర్థం కావటం లేదు. అసలు మీ పెళ్ళి గురించి అతనికెలా తెలుసు?" అన్నాడతను.

"సాగర్ గుంటూరుకి దగ్గర. అతను ఆర్‌టీసీలో పని చేస్తున్నాడు కండక్టరుగా. మీరే వూహించండి. డ్యూటీ మీద అక్కడకొచ్చినప్పుడు మమ్మల్ని చూశాడేమో?

అప్పుడే పెళ్ళి చేసుకున్నట్లు కూడా అర్థమై వుంటుంది" అన్నాను.

అతను తలూపాడు "కానీ, ఇక్కడ అతని ఆచూకీ దొరకడం లేదు. హోటల్స్ అన్నీ చెక్ చేశాం. స్నేహితుల దగ్గర వుంటున్నాడేమో తెలియదు. తెలుసుకోవడం కష్టం. బహుశ పత్రికలకి అతని ఫోటో ఇస్తే ప్రయోజనం...." ఇన్‌స్పెక్టర్ చెప్పుకుపోతోంటే మధ్యలో ఫోను మ్రోగింది.

విమల రిసీవరెత్తి సమాధాన మిచ్చింది. ఆ తర్వాత అవతలి మాటలు వింటూ భయంతో కళ్ళు విశాలం చేయసాగింది.

చటుక్కున రిసీవరందుకొని విన్నాను.

"....రాత్రి నీ మొగుడు వూడిపడి ప్లాన్ చెడగొట్టాడు. నేను పారిపోయాను. వాడో హీరో అనుకున్నావా నేను పారిపోవడానికి? అదేమీ కాదు. వాడూ నాలాగే సామాన్యుడు. పాపం, అదృష్టం వరించింది. కత్తిపెట్టి అన్యాయంగా చంపడానికి మనస్కరించలేదు. ఈ రాత్రి...."

ఇంతలో నా చేతిలో రిసీవర్ బాజ్జీ లాక్కున్నాడు. అవతలి మాటలు ఆశ్చర్యంగా, వుద్రేకంగా విని, మౌనంగా పెట్టేశాడు.

"రాత్రి 11 గంటలకి ఛాలెంజ్ చేస్తున్నాడు" అన్నాడతను.

"అయితే వల విసురుదాం" అన్నాను.

సరిగ్గా రాత్రి 9 గంటలకి బాజ్జీ హెడ్‌కానిస్టేబుల్‌నీ మరో ఇద్దరు కానిస్టేబుల్స్‌నీ వెంటబెట్టుకొచ్చాడు.

"ఓ. కే. ఇక వల విసురుదాం! మనం నల్గురం నాలుగు

చోట్ల వుండాలి" అన్నాడు హెచ్. సి. నుద్దేశించి.

ఆ తర్వాత కానిస్టేబిల్స్‌వైపు తిరిగాడు "నువ్వు గేటు దగ్గరా, నువ్వు ప్రహరీగోడ పొడుగూతా కనిపెట్టాలి. నేను చుట్టూ పహరా కాస్తాను.

"మిస్టర్ కిరణ్, మీరా మెట్లో క్రింద డ్రాయింగ్ రూమ్‌లో గడియ వేసుకొనుండండి. పైన గది కెళ్ళకండి. పనిమనుషుల్ని ఎవరి గదుల్లో వారుండమనండి. అతను సమయమిచ్చి మరీ వస్తున్నాడంటే ఈసారి సీరియస్‌గా తీసుకుంటాడన్నమాట. జాగ్రత్తగా వుండండి. మేము వున్నంతవరకూ ఏ ప్రమాదమూ లేదు."

అలాగే నేనూ విమలా డ్రాయింగ్ రూమ్‌లో గడియ వేసుకొని కూర్చున్నాం. లైటార్పేశాం.

బయట వెన్నెల చక్కగా కాస్తోంది. రామారావు లోపలికి ప్రవేశిస్తే స్పష్టంగా కన్పిస్తాడు.

విమల నా చెయ్యి గట్టిగా పట్టుకొని కూర్చుంది. ఆమె చెయ్యి చల్లగా మంచుపలకలా వుంది. చీకట్లో ముఖ భావాలు కన్పించకపోయినా ఎంత భయపడ్తుందో తెలుస్తోంది. మృదువుగా ఆమె చేతిని తప్పించి నా చేతి లోకి తీసుకొన్నాను. ఆమె శరీరాన్ని వెచ్చబరచి భయం పోగొట్టాలని దురుసుగా నిమరసాగాను. ఆమె నా భుజం మీద వాలి గట్టిగా కరచుకుంది.

"విమలా! భయపడకు, ఏమీ జరగదు."

"ఓహ్! నేను న్యూసెన్స్‌గా తయారయ్యాను కిరణ్! ఏమనుకొని నిన్ను చేరదీశాను? ఏం జరుగుతోంది? నీ సవాలక్ష బాధలకి అదనంగా నేనూ చేరాను. నీకు క్షణం సుఖం ఇవ్వలేక పోతున్నాను."

"ఫరవాలేదు. ఈ ఒక్క రాత్రే! ఈ రాత్రి గడవ

నీయ్, మనకే సమస్యలూ భయాలూ వుండవు. సంతోషంగా వుంటాం."

ఆమెని ఒళ్ళోకి లాక్కొని హత్తుకొన్నాను.

అప్పుడే బయట ఒక్కసారిగా విజిల్స్ విన్పించాయి. కలకలం బయలుదేరింది. అరుపులూ, బూట్ల చప్పుళ్ళూ విన్పిస్తున్నాయి. విమల నన్నింకా బలంగా చుట్టుకుంది. నేను కొయ్యబారిపోయి వింటున్నాను....ఆ శబ్దాలన్నీ ఇంటి వెనక్కి వెళుతున్నాయి.

ఇంతలో ఏదో విరిగి పడిన చప్పుడు, గట్టిగా కేక! మళ్ళీ విజిల్స్....బూట్ల చప్పుడు....క్రమ క్రమంగా అవన్నీ దూరమవుతూ విన్పించడం మానేశాయి.

మేమిద్దరం ఎంతసేపు అలా గడిపామో తెలియదు. బాజ్జీ వచ్చి తలుపు తట్టాడు. తటాలున వెళ్ళి తెరిచాను.

"ఏం జరిగింది?" ఆతృతగా అన్నాను.

"తప్పించుకున్నాడు."

"ఎలా?"

"ముందు ప్రహరీగోడ దూకాడు. జవాను విజిల్ వేసేసరికి ఇంటి వెనుక ఉరికాడు! పెరటి తలుపు దగ్గర హెడ్‌ని ప్రక్కకు లాగేసి వీధిలోకి పారిపోయాడు. మేం వీధిలోకి కెళ్ళేసరికి ఎక్కడా కన్పించలేదు. బయట లైట్లు లేవు. తప్పించుకొన్నాడు."

"హెడ్‌కు బాగా దెబ్బలు తగిలాయా?"

"అసలతని జాడలేదు! మేం వెళ్ళేసరికక్కడ లేదు! కేక మాత్రం విన్నాం....అతను కొట్టి ఏ మూలకి లాగేశాడో చూడ్లేదు."

నిట్టూర్చాను. ఇంతలో కానిస్టేబుల్స్ తిరిగి వచ్చారు.

"సార్! హెడ్డుగారి తల పగిలింది!"

"ఎలా? ఎక్కడున్నాడు?"

"వేపచెట్టు క్రింద పడిపోయాడు...."

"డామిట్! గున్నలా వున్నాడు, అడ్డుకోలేక అడ్డం పడ్తాడా!" అర్చాడు బాబ్జీ.

## 7

మర్నాడు మామూలుగా దినచర్యలు ప్రారంభమైయ్యాయి.

విమల బాగా నీరసించిపోయింది. రాత్రి రామారావు ప్రయత్నం విఫలమైనా ఆమె భయం తగ్గలేదు. విమల యింకా అపాయాన్నాశిస్తోంది.

కానీ, మళ్ళీ రామారావు యెలాంటి ప్రయత్నాలు చేస్తాడని నాకనిపించడంలేదు. రాత్రి అతను పోలీసుల బారినుండి తప్పించుకొన్నాడు—ఒకర్ని గాయపర్చి. మళ్ళీ ఈసారి సాహసిస్తాడనుకోను.

అయినా నా బాధ్యత గనుక, విమల వ్యతిరేకించినా మేనేజర్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను.

"....రెండుసార్లు ఆమెమీద హత్యాప్రయత్నం జరిగింది. తప్పించుకుంది. ఈ రాత్రి కూడా జరగవచ్చు. మీరామె శ్రేయస్సు కోరేవారు గనుక చెప్తున్నాను—ఆమెని రక్షించే ప్రయత్నాలేవైనా ఉంటే చెయ్యండి!"

"రాత్రిలోగా ఆ బాస్టర్డ్‌ని అరెస్టు చేయిస్తాను!" అన్నాడతను ఆవేశంగా.

నవ్వుకొని ఫోన్ పెట్టేశాను.

ఇంతలో యెవరో నల్లటి కుర్రాడు వచ్చాడు. విమల అతన్ని తీసుకొని లోనికెళ్ళింది. ఆరంగాక నేనూ వెళ్ళాను. అక్కడామె మాసిన బట్టలేస్తోంటే ఆ కుర్రాడు

చాకలివాడనుకొన్నాను. అతడు బట్టలు నూతి దగ్గరకు మోసుకెళుతూంటే అనుమానం కలిగింది.

"అదేమిటి? రేవుకి తీసికెళ్ళడా?" అన్నాను.

"నా బట్టలు మరొకరిదాంట్లో కలపడానికి వీల్లేదు!" అంది విమల.

నేను మాట్లాడలేదు. ఆ పగలంతా ఆలోచిస్తూ గడిపాను, ఇంత అస్తిని నే నెలా అజమాయిషీ చేయగలనా అని! ఇంతకంటే ఆందోళనకరమైన విషయం, విల్లు నా పేర మార్చబడిందని తెలిసి రావ్ ఎలా రియాక్టు అవుతాడన్నది! పెళ్ళికి అంగీకరించనివాడు ఆ స్త్రీమీద పెత్తనం సహిస్తాడా?

సాయంత్రం ఆరు గంటలకి నేనూ విమలా లాన్‌లో కూర్చొని మాట్లాడుకోసాగాం. ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. ఆ వాతావరణాన్ని చూశాక నా కొక ఆలోచన వచ్చింది. విమలని చూశాను.

"నువ్వు తిరిగి కోలుకోవాలంటే స్థలంమార్పు కావాలి. మనం ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోతే రామారావు పీడా వుండదు, నీ ఆరోగ్యమూ చక్కబడుతుంది. ఏమంటావు?"

ఆమె ముఖం వికసించింది. "అవును, సరిగా చెప్పావు! ఎక్కడికెళ్దాం?"

"నీ యిష్టం. నువ్వే ప్రోగ్రాం వెయ్యి!"

"చిత్ర వుంటే ఎంత బాగుండేది! దానికి అయిడియాలు బాగా వస్తాయి!"

"ఆమె అయిడియాలు నాకు కంపుకొడ్తాయి!"

"ఆమె నెందుకలా ఛీత్కరించుకొంటావు?"

"నువ్వాడదానివి! మరో మగవాడన్నదుగు—ఎందుకు

ఛీత్కరిస్తాడో? వెధవ ముక్కు, కళ్ళునూ! గొంతు చూశావా? కాకిలా అరుస్తుంది!"

ఆమె పకపక నవ్వింది. నేనది పట్టించుకోకుండా యింకా కోపం నటిస్తూ సిగరెట్ వెల్గించాను. దమ్ము లాగి పొగ వదులుతూ తల పైకెత్తాను. నా కళ్ళు డాబా గోడమీద నిశ్చలంగా వుండిపోయాయి.

"అరే, నీ చీర అక్కడుందేమిటి?" అన్నాను చూపిస్తూ.

విమల వెనక్కి తిరిగి పైకి చూసింది.

"ఉదయం బాచిగాడు ఆరేశాడు. మధ్యాహ్నం బట్ట లన్నీ ఇంట్లోకి తెచ్చాడు.... దాన్ని మర్చిపోయి వుంటాడు" అంది లేస్తూ.

"నువ్వెందుకు? రాజుని పంపు!" అన్నాను మొక్కలు కత్తిరిస్తున్న అతన్ని చూస్తూ.

"అతను మెట్లెక్కలేడు.... కీళ్ళ నొప్పులు."

"అయితే కాంతాన్ని పంపు!"

"ఆమే ఎక్కలేదు.... పెద్దమనిషి."

"అయితే మెట్లెక్కలేని మనుషులు ఇంట్లో యెందుకు? పేవ్ మెంట్లమీద వుండమను!" అన్నాను తీవ్రంగా.

ఆమె చివాల్న చూసింది. ఆమె కళ్ళలో బాధ తళుక్కున మెరిసింది—

"నువ్వింత చవగ్గా మాట్లాడతావనుకోలేదు!" అంది లేచి చరచరా వెళ్ళిపోతూ. మౌనంగా సిగరెట్ పీల్చసాగాను. విమల వెళ్ళిన కాస్సేపటికి డాబా మీద కన్పించింది. చీరను విసురుగా అందుకొని వెనక్కి తిరిగింది. ఆమె కోపానికి నవ్వుకుంటూ చూపులు రాజు మీదకు మళ్ళించాను. అతనింకా కత్తిరించడంలోనే

నిమగ్నుడై వున్నాడు.

ఇంతలో కేక విన్పించింది——

విమల కేక!

తలెత్తి చూశాను.

విమల డాబా మీంచి పడిపోతోంది....!! ఆమె చేతిలో చీర గాలికి రెపరెపలాడుతోంది! క్షణంపాటు డాబామీద ఓ ఆకారం కన్పించి అదృశ్యమైంది. విమల వేగంగా క్రిందికి వచ్చేస్తోంది! నా పిచ్చిగాని, ఆమె నందుకోవాలని చేతులుజాపి వురికాను.....ఆ లోపు ఆమే క్రింద కారు బాయ్‌నెట్ మీద బోర్లాబడి అతుక్కుపోయింది! నేనక్కడికి చేరుకొనేసరికి అంతా అయిపోయింది....

విమల ఈ లోకం విడిచిపెట్టేసింది!

# 8

విధి నెవరు మార్చగలరు? అసలు దాన్ని తెలుసుకుంటే కదా మార్చడానికి!

ఈ భూమ్మీద కాలు పెడుతున్నప్పుడు భగవంతుడు ఫలానావారికి ఫలానా ముద్ర అని నిర్ణయించి నుదుటిమీద కొట్టి పంపిస్తాడు. అందులో భావాల్ని పసిగట్టి ఇష్టానుసారంగా చెరిపేసుకొని మార్చుకొనే శక్తి మానవ మాత్రుడికి లేదు!

విమల నొసట ఈరోజు చావు రాసిపెట్టి వుంది. చనిపోయింది. ఆమెనెవరూ ఆపలేరు. తిరిగి బ్రతికించనూలేరు. కానీ విమల చావుకి కారణభూతులైన వారిని శిక్షించగలం. అదొక్కటే ఆమె ఆత్మవిషయంలో చేయగల్గింది.

ఒక విధంగా విమల చావు క్కారకుడ్ని నేనేనేమో? ఈ పెళ్ళి జరక్కపోతే ఆమె క్షేమంగా వుండేదేమో?

ఈ పెళ్ళివల్ల అసూయతో, పగతో, రామారావు ఆమె నంత మొందించాడు!

రామారావు!

చివరికి పంతం నెగ్గాడు! అతని నుండి ప్రమాదం రాత్రులే ఆశించాం గానీ, పగలుకాదు. రాత్రిళ్ళు వరుసగా విఫలం కావడంతో ఇలా ఎవరూ అనుకోని విధంగా పగటి ప్రయత్నానికి పూనుకొన్నాడు!

విమల చనిపోయింది. ప్రతివారూ నన్ను నిందించే వారే! నే నామెకు దురదృష్టం తెచ్చానట! పొట్టన బెట్టుకున్నానట! నోటికొచ్చినట్లు కూసి శాపనార్థాలు పెట్టి వెళ్తున్నారు! అవన్నీ భరించాను.

నా కెవరి సానుభూతి అక్కర్లేదు. నా మానాన నేను బ్రతుకుతాను. దూరంగా వెళ్ళిపోతాను. ఒంటరిగా బ్రతుకుతాను. ఎవరి సహకారమూ అవసరంలేదు.

విమల నాకు కొండంత ధైర్యాన్నిచ్చింది—ఎవరెన్ని ఆటంకాలు కల్గించినా చట్టరీత్యా నాకు సంక్రమించే ధనాన్నిచ్చింది. ఇవి చాలు! ఆమెకు నేను ఆజన్మాంతమూ రుణపడివుంటాను.

ఆ రాత్రి నిద్రలో విమల కన్పించి పకపక నవ్వింది—వెటకారంగా—హేళనగా. ఆ నవ్వు కర్థం తెలియలేదు! ఎందుకలా నవ్వింది? నే నామె చావుని పరిష్కరించకుండా నా భవిష్యత్తు గురించి కలలు గంటున్నాననా?

ఆమెని జీవితాంతం ప్రేమిస్తాననీ, మర్చిపోననీ వాగ్దానం చేశాను. ఇప్పుడు దాన్ని విస్మరించి, సిగ్గులేకుండా నా బాగోగులు చూసుకొంటున్నానని ఆగ్రహం వెలిబుచ్చుతోందా?

రెండు రోజుల తర్వాత ఇన్‌స్పెక్టర్ బాజీ ఒక వార్త మోసుకొచ్చాడు—రామారావు గుంటూర్లో తన ఇంట్లో ఉరిపోసుకు చనిపోయాడట!

పగ తీరాక చట్టం చేతిలో నలగడం మనస్కరించలేదేమో, జీవితాశయం నెరవేరింది గనుక తృప్తిగా తనువు చాలించాడు.

నవ్వాలో ఏడ్వాలో అర్థంగాలేదు. విమల వెటకారపు నవ్వు యింకా మానలేదు. రోజులు గడుస్తోంటే ఆ యింట్లో గడపటం దుర్భరమనిపిస్తోంది. వంట మనిషినీ, రాజునీ తరిమేశాను. హోటల్స్‌లో తింటూ, బార్స్‌లో తాగుడు మరిగాను.

నా పరిస్థితి చూసి చిత్ర సహాయపడాలనుకుంది. ఆమెను కసిరికొట్టాను. నాకెవరూ వద్దు. ఎవరి కపట స్నేహమూ వద్దు. నేనిప్పుడు డబ్బుగలవాడ్ని. మనిషి ఛాయ పడని చోటు కోసం అన్వేషిస్తాను. అలాటి చోటు ఈ విశ్వంలో ఏ మారుమూల ఉన్నా సరే-అక్కడ నాదంటూ ఒక సామ్రాజ్యాన్నేర్పరచుకుంటాను. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో బ్రతికేస్తాను!

మరో నెల గడిచాక యింకా యిక్కడ వుండటంలో అర్థం కన్పించలేదు. గడ్డు పరిస్థితి అంటూ ఏర్పడ్డాక దాన్నెప్పటికైనా ఎదుర్కోవాల్సిందే! నేనిప్పుడే తెగించడానికి సిద్ధపడ్డాను.

లాయర్‌ని పిల్చి నా కార్యక్రమం వివరించాను. కంపెనీతోబాటు ఆస్తులన్నీ అమ్మకానికి పెట్టమన్నాను. నా చేతికి నగదు కావాలి. నేను మరో ప్రపంచంలో అడుగు పెట్టాలి. మొత్తం ఎంత డబ్బు రావచ్చు? కంపెనీ ఆస్తులు రెండుకోట్లు విలువచేస్తాయి. కలకత్తా, విజయ

వాడలోను, ఇంకా పలుచోట్ల ఆస్తులన్నీ కలిపి మరో కోటిన్నర చేస్తాయి. మొత్తం మూడున్నర కోట్లన్న మాట?

ఈ ఆస్తుల అమ్మకం వార్త దుమారంగా లేచింది. కాకులు నన్ను కుళ్ళబొడిచాయి. అందరికీ చిరునవ్వుతో సమాధానమిచ్చాను. నా ఆస్తి, నా హక్కు. ఇందులో మీ జోక్యం మంచిది కాదు. మైండ్ యువర్ బిజినెస్.

నా ఆగడాలు చూసి మేనేజర్ రావ్ అంతెత్తు కెగిరాడు. ఎంత యెగిరినా కాళ్ళు విరగడంతప్ప ప్రయోజనంలేదు. నన్ను ఛాలెంజి చేస్తాడా? నా దారి వెనక్కి మళ్ళదుగాక మళ్ళదు!

## 9

ఈ ప్రపంచం నా కాళ్ళక్రింద నలుగుతున్నట్లు ఫీలయ్యాను. నా ఆనందాని కవధుల్లేవు! ఇన్నాళ్ళూ నన్ను అసహ్యించుకున్న వాళ్ళంతా ఇప్పుడు నా కాళ్ళ దగ్గర కుక్కల్లా చేరుతారు! నేను చెప్పినట్లు ఆడుతారు! వాళ్ళ జుట్టు నా పరంజేసి, చేతులు జోడించి నిలబడతారు! డబ్బు! డబ్బు! అంతా డబ్బు!!

గత పదిహేనేళ్ళ నా జీవితం ఎన్నో అవమానాలకూ, అన్యాయాలకూ గురయింది. అందరి స్వార్థానికీ, హింసకూ బలయ్యాను. ఎన్నో ఎదురు తెన్నులు తిన్నాను. ఏ నాటికీ ఒడ్డు చేరలేకపోయాను.

అసలు నేనే కావాలని ఆ జీవితంలోకి అడుగు పెట్టాను. తీరా అనుభవమయాక బయటపడాలని ఆరాటపడ్డాను. నా కలలే నన్ను తుదముట్టించాయి! వూహ పెరగక పోయినా కలలు మాత్రం బ్రహ్మాండంగా కనేవాడ్ని. బళ్ళో చదువుకునేటప్పుడు నా తోటివాడు కట్టుకునే

రిస్టువాచీ నుంచి, బయట ప్రపంచంలో పడ్డాక ఫియట్ కారువరకూ నా కలలు పెరిగాయి.

ఆ రిస్టువాచీ నాలో నేర ప్రవృత్తికి నాంది పలికింది. దానికోసం వాడ్ని చెరువులో ముంచి చక్కాపోయాను. అలా నేరాలతో మునిగి తేలుతున్న నా జీవితం హైద్రాబాద్‌లో చిత్ర పరిచయంతో వింతమలుపు తిరిగింది.

చిత్ర!

చిత్రను నేను అసహ్యించుకొంటున్నట్టు మనవిచేశాను. ఆ అసహ్యం వెనుక అసలు కారణం యిప్పుడు చెప్తాను.

నిజానికి చేప కళ్ళంటే నాకు చాలా ఇష్టం. అందులోనూ అవి వాలు చూపులు విసిరేవైతే మరీ ఇష్టం. అలాటి చిత్ర కాంతివంతమైన నయనాలు, వికసిత వదనం చూశాక సగం పిచ్చివాడ్నై హృదయం తీసి ఆమె చేతుల్లో పెట్టేశాను!

ఆ రాత్రి 'షాలిమార్' చిత్రం చూసి ఆటో కోసం ఎదురు చూస్తున్నాను. జనం ఎక్కువ వుండడంవల్ల దొరకడం కష్టమవుతోంది....రద్దీ తగ్గాక నిదానంగా వెళ్దామనుకొని రోడ్డువారగా నిలబడ్డాను. అప్పుడే డిక్కులు చూస్తూ వచ్చి నా ప్రక్క నిలబడ్డ చిత్రను చూశాను.

ఆమెని చూశాక పలకరించకుండా వుండలేకపోయాను.

"మీకూ ఆటో కావాలా?" అన్నాను.

తలూపిందామె. అటూ ఇటూ చూశాను. దూరంగా వస్తోన్న ఆటోని చూసి చెయ్యూపి దగ్గరికి పిల్చాను. అది వచ్చాక ఆమెని చూసి ఎక్కమన్నట్టు సైగచేశాను. ఆమె తటపటాయించింది.

"మీరు వెళ్ళరా?" అంది.

"మరో ఆటోలో వెళ్తాను" అన్నాను.

"ఎక్కడికి వెళ్ళాలి?" మళ్ళీ అందామె.

చెప్పడానికి మనస్కరించలేదు. "మీరు?" అన్నాను.

"కంపాలా హోటల్" అందామె.

"నాది అదే దారి. కానీ...."

"అయితే మీరూ రండి!" అందామె. కాస్సేపు సందేహించి ఎక్కేశాను. కానీ అడగడంతోటే వెళ్ళటం సభ్యత కాదనిపించింది. ఆటో బయలుదేరింది. చాలా సేపు ఆమె మాట్లాడలేదు. ఏదో ఆలోచనలో వుంది. నేనే ఏదో మాట్లాడాలని అన్నాను, "ఎలా వుంది సినిమా?"

ఆమె తేరుకుని చూసింది. అంతలోనే నవ్వి, "ఛేంజ్ నవల 'ది వల్చర్ ఈజ్ ఎ పేషంట్ బర్డ్' చదివాను. దానికీ దీనికీ పెద్ద తేడా కనిపించలేదు" అంది.

"కానీ ఆ స్క్రిప్టుమీద కృష్ణషా ఆరేళ్ళు వర్క్ చేశాడని విన్నాను" అన్నాను.

"ఎన్నేళ్ళు కృషి చేసినా దాన్ని హాలీవుడ్ పద్ధతిలో తీయడమే పొరపాటు. మాస్ కు నచ్చే మసాలాలున్నప్పుడే చిత్రాలు హిట్ అవుతాయి...."

"మాస్ సంగతి వదిలేయండి. మీరు క్లాస్—క్లాస్ గురించి చెప్పండి."

మళ్ళీ నవ్విందామె. "నిజం చెప్పాలంటే నాకు క్రైం చిత్రాలు నచ్చవు. సాహిత్యం చదువుతానంతే."

"అలాగా? నాకు చదువు సరిగా రాదు. ఎలా వున్నా ప్రతీ సినిమా చూసేస్తాను!"

ఆమె వింతగా చూసింది. "మీకు చదువు రాదంటే నమ్మను!"

"సరిగా రాదన్నాను—సవరించుకోండి."

"ఓహ్, ఏం చదివారు?"

"మెట్రిక్ తప్పాను. మళ్ళీ హైరానాపడి చదవలే నన్పించింది. మా అమ్మ కూడా ఆ విషయం ఒప్పుకుంది."

ఆమె ఎగాదిగా చూసింది. "మీ రెక్కడుంటారు?"

"నాకో వూరూ అడ్రసూ లేదు."

"అంటే?"

"ఏదైనాచేసి స్వతంత్రంగా బ్రతకాలని ఇక్కడ తిరుగుతున్నాను."

"ఏం చెయ్యాలనుకుంటున్నారు?"

"ఏదీ చెయ్యడానికి సందేహించను.... నా సంగతి వదిలేయండి. మీరు హోటల్ లో ఎందుకుంటున్నారు?"

"విజయవాడనుంచి వచ్చాను. నా ఫ్రెండ్ పనిమీద."

"ఒంటరిగానా?"

"అవును."

నేను మాట్లాడలేదు. ఆటో వెళ్తోంది. ఆమె మరి పలకలేదు. మౌనంగా ఆలోచిస్తోంది. మధ్య మధ్య నన్ను గమనిస్తున్నట్లు అనిపించింది.

నాకూ ఆమె కళ్ళకేసి చూస్తూ గడపాలని ఆరాటంగా వుంది గానీ, సాహసించలేకపోయాను. అలా ప్రారంభమైన మా పరిచయం మూడు రోజులుసాగింది. ఆ అవకాశంతో ఆమె కళ్ళకేసి చూస్తూ గడిపే భాగ్యం పూర్తిగా లభించింది. మాలో ఆకర్షణ పెరిగి బంధం ఏర్పడింది.... మేమిరువురం చెయ్యీ చెయ్యి కలిపి బాసలు చేశాం.

అయితే నా గతాన్ని దాచి ఆమెను మోసగించడం నచ్చలేదు. అందువల్ల నా చరిత్రంతా చెప్పేశాను—ఆమె

వాడలిపోలేదు. ఆసక్తిగా వింది. విన్నంత వేగంగానూ ఆలోచించింది. చివరికి అంది—

"కుమార్, నాకూ నీలాంటి ఉద్దేశమే వుంది. కానీ, అది నెరవేరదన్పిస్తోంది...."

"ఏమిటో చెప్పు" అన్నాను.

"నాకో ఫ్రెండ్ వుంది. వొంటరిగత్తె. కోట్ల ఆస్తికి వారసురాలు.... నేనీ బ్రతుకుతో విసిగిపోయాను! నాకూ సౌఖ్యాలు కావాలి! అందమైన నగలు, దుస్తులు, డబ్బు, కారు, బంగళా, ఇంకా....ఇవన్నీ దానిదగ్గర చూసి ఉవ్విళ్ళూరడం తప్ప సాధించలేకపోతున్నాను. నువ్వూ ఇదే ఆలోచనలో వున్నావు. ఒకవేళ మనిద్దరం కలిస్తే సాధించగలమేమో?"

ఆమెని పరీక్షగా చూశాను. ఆమెకిలాంటి ఆలోచన లుంటాయని అనుకోలేదు!

"సాధించగలం. నీకేదైనా ఉపాయం వుంటే చెప్పు" అన్నాను.

"చాలా ఆలోచించాను. నిన్ను చూసినప్పుడే అను కున్నాను—ఇది నీ వల్లనే సాధ్యమవుతుందని. ముందు నువ్వామెని పెళ్ళి చేసుకోవాలి. ఆమె మనసు పాదరసం లాంటిది. సరైన తోడుకోసం తపించిపోతోంది....నిన్నూ నీ గ్లామర్‌నీ చూసి సులభంగా లొంగిపోతుంది! పెళ్ళయాక విల్లు నీ పేర మార్చేలా చేస్తే, వీలు చూసుకొని ఆమెని తప్పించవచ్చు—ఎలా వుంటుంది?"

ఈ ఆలోచన నాకు నచ్చింది. దీన్ని మేం ఇంకా మెరుగులు దిద్ది పటిష్టమైన పథకం సిద్ధంచేశాం. వారం రోజుల్లో అమల్లో పెట్టాం.

చిత్ర విజయవాడ వెళ్ళి ఏర్పాట్లన్నీ చేశాక నేను

బయలుదేరాను.

ఆ రోజు సాయంత్రం ఆ రోమియోని నేనే యాభై రూపాయలిచ్చి విమల మీదకు ఉసిగొల్పాను. ఫలితం మేం అనుకున్న విధంగానే వచ్చింది! ఆ తర్వాత నా కట్టు కథలతో విమల నా ఆకర్షణలో పడ్డం సరిగ్గా చిత్ర చెప్పినట్టే జరిగింది!

చిత్రా నేనూ ఎదురుపడ్డప్పుడు ఏ రూపంలోనైనా మా భావాలు బయటపడవచ్చన్న భయంతో, ఆమెని అసహ్యించుకున్నట్లు నటిస్తూ దూరంగా వుంచసాగాను. విమలకు మా మీద ఏ అనుమానమూ రాలేదు. మా నాటకం బాగా రక్తి కట్టింది!

ఆ తర్వాత చిత్ర విమలను పెళ్ళికి ఒప్పించింది. మేం హనిమూన్ కెళ్ళి సాగర్ రావడానికి ఒక రోజుముందు, చిత్ర నాగులు ముఠాని రంగంలో దింపింది. గతంలో విమలను వేధించిన రామారావుని మా పథకంలో బలి పశువుగా వాడుకోవాలని నిశ్చయించాం.

దాని ప్రకారం నాగులు ముఠా గుంటూరులో రామారావ్ ని కిడ్నాప్ చేసి విజయవాడలో బంధించింది. అప్పటినుంచి నాగులు రాత్రులు సంచరిస్తూ రామారావు పాత్ర పోషించసాగాడు....

ఆ రోజు ఉదయం చాకలి కుర్రాడు వచ్చినప్పుడు నాకో ఉపాయం తట్టింది. దాన్ని నాగులుకి ఫోన్ చేసి చెప్పాను.

మధ్యాహ్నం ఆరిన బట్టలన్నీ బాచిగాడు ఇంట్లో తెచ్చిపెట్టాక, నేను రహస్యంగా ఒక చీర డాబామీద చేరవేశాను. సాయంత్రం పెరటి తలుపు తీసివుంచాను. నేనూ విమలా లాన్ లో కూర్చున్నప్పుడు కారును సరిగ్గా

డాబా గోడ క్రింద వుండేలా చూశాను. అప్పుడు అనుకున్న విధంగా అంతా జరిగిపోయింది.

నాగులు వెనుక దారిగుండా డాబా చేరుకొని గోడ మీద చీర వేయడం; దాన్ని నేను విమల దృష్టికి తేవడం అనుకున్నట్టే ఆమె పైకి వెళ్ళడం; క్షణాల్లో గావుకేకతో క్రిందికి పడినప్పుడు—సూటిగా కారు బాయ్‌నెట్ మీద జెండా ఎగురవేసే అరంగుళాల పొడవు మొనదేలిన కడ్డీ ఆమె గుండెల్లో గుచ్చుకోవడం....

అంతా అనుకున్నట్లే జరిగిపోయింది! రామారావుని మా క్షేమం కోసం ఉరితీయించి ఇంట్లో వ్రేలాడదీశాం! దాంతో మా పథకం పూర్తిగా విజయవంతమైంది!

ఇప్పుడు మాకేదీ అడ్డులేదు. మా మార్గం పూర్తిగా సుగమమైంది! నా చేతికి డబ్బు రావడమే ఆలస్యం, ఇక్కడ్నుంచి దూరంగా కనుమరుగవుతాం. వీలైతే దేశం విడిచి పారిపోతాం!

మూడున్నర కోట్లు! నా వొడలు జలదరించింది.

## 10

టాక్సీ ఇంటిముందాగడంతో ఉలికిపడి తేరుకున్నాను. ఇల్లు చీకటిగా నిశ్శబ్దంగా వుంది. పైన గదిలో లైటు వెలుగుతోంది. అయితే చిత్ర వచ్చేసిందన్నమాట!

గేటు తెరిచి లోనికెళ్ళాను. చల్లటిగాలి వీచి శరీరం పులకరించింది. నైట్ క్వీన్ పరిమళం గుప్పుమని వ్యాపించి ఏదో తెలియని అలౌకికానుభూతికి గురిచేసింది. మొక్కలు చెట్లూ వొయ్యారంగా వూగుతున్నాయి.

ఆకాశంలో చంద్రుడు లేడు. అయితే ఏమిటి? చిత్రతో నేను గడుపబోయే మధుర క్షణాల్ని తలచుకున్నప్పుడు, చల్లని చైత్రమాసపు రాత్రులలో వికసించే

పున్నమి వెన్నెల వేడిలా, ఈ నిశా రాత్రి వాతావరణమే ఆహ్వానిస్తోంది!

వేగంగా ఇంటికేసి అడుగులేస్తున్నాను. నాలో ఆతృత గుర్రమై దౌడుతీస్తోంది! పథకం విజయవంత మయ్యాక మొదటిసారి చిత్రను కలుసుకోబోతున్నాను. అప్పుడు చూడాలి, ఆమె సుందర నయనాలు ఎలా విప్పారి, ముగ్ధ మోహన సౌందర్యం ఆనంద సాగరంలో వింత కాంతులను విరజిమ్ముతుందో!

నడుస్తున్నవాడ్నల్లా ఎందుకో ఆగిపోయాను.

ఏదో మెరుపులాంటిది నా కళ్లను సోకినట్లనిపించింది. తల త్రిప్పి చూశాను—అప్పుడు కన్పించింది—విమల—ఆమె అక్కడ—పోక చెట్టు క్రింద—

నిటారుగా నిలబడి తీక్షణంగా చూస్తోంది. ఆమె కళ్లు కొవ్వొత్తుల్లా వెలుగుతున్నాయి. అతి పల్చటి తెల్లని వస్త్రం మిరుమిట్లు గొలుపుతున్న ఆమె అంగ సౌష్టవాల్ని మరుగుపరుస్తోంది. ఆమె ముఖంలో ఏ భావాలూ లేవు. ఆమెలో అసలు చలనంలేదు! శిలా విగ్రహంలా నిలబడి నాకేసి చూస్తోంది—

నా కాళ్లలో వణుకు పుట్టింది. వొళ్లు చల్లబడిపోయి నోరు తడారింది. గొంతు పెగలడంలేదు. కళ్లప్పగించి చూస్తున్నాను. ఊపిరి వేగం హెచ్చి ఆయాసపడుతున్నాను. అతి కష్టంమీద గొంతు పెగిల్చి అన్నాను. "విమల—విమల నువ్విక్కడ—"

కానీ సమాధానంలేదు. ఆమె నా మాటలు విన్నట్లు లేదు. ఆమె చూపుల్లో తీవ్రత తగ్గలేదు. వాటి తీక్షణత ధాటికి తట్టుకోలేకపోతున్నాను. నా చేతిలో సూట్ కేసు జారి క్రింద పడింది—

భయంతో, "విమలా....!! నువ్విక్కడేం చేస్తున్నావ్?" అనర్చాను శక్తికొద్దీ.

ఆమె కళ్లు అగ్నిగోళాలయ్యాయి.

వణుకు క్రమంగా నాలో పైకి ప్రాకి, చలిజ్వరం రోగిలా రెండు దవడలూ విపరీతంగా కొట్టుకో నారంభించాయి....

విమల రెండు చేతులూ చాచి చిన్నగా నా వైపు రాసాగింది.

"వి-వి-విమలా! నన్నేమీ చెయ్యకు! ప్లీజ్! నన్నేమీ చేయకు!"

ముందుకు తిరిగి పరిగెత్తనారంభించాను. వేగంగా వురికాను.

వెనుక ఆమె నవ్వుతోంది—హేళనగా—వెటకారంగా!

ఒక్కో అంగలో మూడేసి మెట్లెక్కి వరండా చేరుకున్నాను. తలుపుమీద దబ-దబా బాదేస్తూ చిత్రని పిల్చాను.

చిత్ర నిదానంగా తలుపు తెరిచి, "ఎవరూ?" అంది.

"నీ ముఖం! పద లోపలికి!" ఆమెని వెనక్కి నెట్టి లోనికి దూకాను. దఢాలున తలుపువేసి గడియపెట్టాను.

చిత్ర నన్ను వింతగా చూస్తోంది.

"ఏమిటి కుమార్? ఏమైంది? ఎందుకలా వున్నావ్?"

కాస్సేపటివరకు మాట్లాడలేదు. నా భయం ఇంకా తొలగలేదు. ఇలాటి అనుభవం ఇదివరకెన్నడూ లేదు!

"చిత్రా! మనం ఇక్కడ్నుంచి పారిపోవాలి! వెంటనే ఈ ఇల్లు వదిలేయాలి!"

"ఎందుకు? ఏం జరిగిందసలు?" గాభరాగా అడిగిందామె.

"నీకేం అనుభవం కాలేదా?"

"ఏ అనుభవం?"

"విమల నీకు కన్పించలేదా?"

ఆమె ముఖం చిట్లించింది, "ఏమిటీ! ఆమె కన్పిస్తుందా?"

"అవును, ఆమె దెయ్యమై తిరుగుతోంది—ఈఇంట్లో. నిన్నూ నన్నూ ఇక ప్రాణాలతో వదలదు!"

"కుమార్!" ఆమె దగ్గరికొచ్చి అర్చింది, "ఏమిటి నువ్వనేది? ఆమె దెయ్యమైందా!"

"అవును...." సహనంగా అన్నాను. "నేను వస్తోంటే పోకచెట్టు క్రింద నిలబడి వుంది. కదలకుండా, మెదలకుండా క్రూరంగా చూస్తోంది... నేనెలా తట్టుకున్నానో- నువ్వైతే అక్కడే ప్రాణాలు విడిచేవానివి!"

ఆమె నా తలపట్టుకొని నొక్కుతూ సముదాయిస్తున్నట్టు అంది.

"భయపడకు! ఆమె ఇక్కడికి రాదు. ఆమె చనిపోయింది. అంతే. ఆమెను నువ్వు చూశావంటే అది వట్టి భ్రమ!"

"యూ ఫూల్! ఆమె పక-పకా నవ్వింది కూడా— నీకు విన్పించలేదా?"

"నాకేమీ విన్పించలేదు. నువ్వు ముందు స్నానం చెయ్యి కుమార్, మనసు తేలికపడుతుంది."

ఆమెని విదిల్చికొట్టి లేచాను. కిటికీ దగ్గరికెళ్లి బయటికి చూశాను. చీకటి తప్ప ఏమీ లేదు—

తిరిగి చిత్రను చూశాను.

"ఆమె దెయ్యమై సంచరిస్తోంది! నేను చూసింది నమ్ముతాను! మనమిక్కడ వుండకూడదు చిత్రా, పారిపోవాలి!"

"ప్లీజ్ కుమార్, శాంతించు! నువ్వలాంటివి నమ్మకు!"

"అంటే, నేను చూసింది అబద్ధమంటావా?" అన్నాను ఏ మాత్రం భయపడుతున్నట్లు లేని ఆమె ముఖం లోకి ఆశ్చర్యంగా చూస్తూ.

"అది విమల రూపం! ఆమె నవ్వింది! నా మాటలు నువ్వు ఎందుకు నమ్మవు? నేను చూసి ఇంత భయపడు న్నానంటే—నువ్వు ఆడదానివి—విని ఎంత భయపడాలి? నీకంత ధైర్యం ఎక్కడిది! నువ్వెందుకు భయపడ్డంలేదు? చెప్పు చిత్రా...."

ఆమె కటువుగా అంది, "నీకు పిచ్చెక్కినట్టుంది, కుమార్."

నేనొక్కసారిగా ఉలిక్కిపడ్డాను. నా మెదడులో ఏదో అనుమానం రగుల్కొంది. ఆమె కళ్లలో సూటిగా చూసి చెంపమీద కొట్టాను.

"చెప్పు! నిజం చెప్పు! నువ్వేం చేశావు? నటించలేదూ? మన పథకం ఆమె పసిగట్టి నిన్ను బ్లాక్ మెయిల్ చేసింది, అవునా? ఆమె బెదిరింపులకి భయపడి నువ్వంతా కక్కేశావు! నా చరిత్రంతా చెప్పేశావు! నేనెవరో తెలుసుకుని ఆమె నీ సహాయంతోనే ఎదురు పథకం వేసింది! నువ్వామెని చంపలేదు! ఆమె చావుని ఫేక్ చేశావు! యూ డెవిల్! నన్ను మోసం చేశావ్! నీ కళ్లలో వున్న విధేయత మనసులో లేదు! నీ కళ్లు చూసి మోసపోయాను! యూ డబుల్ క్రాసింగ్ బిచ్!"

రెచ్చిపోయిన ఆవేశంతో ఆమె ముఖం మీద మళ్ళీ కొట్టాను.

ఆమె తూలి క్రింద పడింది.

"కుమార్! నీకు మతిపోయింది! పొరబడుతున్నావు!

నేను మోసం చెయ్యలేదు! విమల నిజంగా చచ్చింది! కావాలంటే నాగులు మురాం చేత నిరూపిస్తాను!"

"సువ్వందమైన అబద్ధాల్ని సృష్టించగలవు!" అరిచాను పిచ్చిగా, "యూ డామ్ లిటిల్ స్లట్! నా కలల గోపురాన్ని కొల్లగొట్టావు! నువ్వింక బ్రతకూడదు!"

ముందుకి దూకి ఆమె కంఠం పట్టుకున్నాను.

ఆమె విదుల్చుకో జూసింది.

నేనామె కంఠం బలంగా పట్టుకొని లేపి నిలబెట్టాను. నా వేళ్లు ఆవేశంగా ఆమె కంఠం చుట్టూ బిగుసుకు పోతున్నాయి.

ఆమె కళ్ళు తేలవేసింది.

"వద్దు! నువ్వలా చెయ్యకు! నన్ను చంపకు! నువ్వు—నువ్వు—చాలా చింతిస్తావు కుమార్!" ఆమె బలహీనంగా అరుస్తోంది.

ఆమె విల-విల్లాడుతూ నాలిక వెళ్ళబెట్టేసింది. కళ్లు వెల్లుబికి వచ్చాయి. నా ఒంట్లో శక్తినంతా ఆమె కంఠం చుట్టూ కేంద్రీకరిస్తున్నాను....కొన్ని క్షణాల్లో దాన్నిక వృధా చేయ నవసరంలేదని తెలుసుకున్నాను.

ఆమె శరీరం నా చేతుల్లోంచి జారి దబ్బుమని నేలమీద పడింది—

• • •

రాబందు లొచ్చేశాయి: రెక్కలు రెప-రెపలాడించు కుంటూ వాలి—మాంసపు ముక్కల కోసం అవురావురు మంటూ ఆక్రమించుకుంటున్నాయి. ఈ రాబందులు చచ్చిన శవాల్ని పీక్కు తినవు. బ్రతికున్న జీవాల్ని కళ్ళ బొడుస్తాయి.

నా గుండె వేగంగా కొట్టుకుంది. చివరికి నా బ్రతుకు

వీళ్ల చేతుల్లో అంతం కాబోతుందన్న మాట! నా గతంలో వీళ్లతో చాలా నికృష్టపు అనుభవాలున్నాయి. వీళ్ల ట్రీట్ మెంట్ తో నా శరీరంలోని ప్రతి అవయవమూ దాని నైశిత్యం కోల్పోయి శిథిలమైంది. చిక్కిన ప్రతి సారీ మళ్లీ చిక్కకూడదని మొక్కేవాడ్ని. ఇప్పుడు మళ్లీ చిక్కాను—శాశ్వతంగా పోలీసులకు. నాకిప్పుడు విముక్తి లేదు.

రాజు!

వీడ్ని నేను కల్లో కూడా అనుమానించలేదు! వీడు నా పొంచి వున్న శత్రువని భావించివుంటే ఎంతో జాగ్రత్త పడేవాడ్ని.

విమల చావు విషయంలో వీడు రావ్ నన్ను అనుమానించారు. నన్ను ఓ కంట కనిపెట్టసాగారు. చిత్రతో నా ఘర్షణ కిటికీ చాటున వుండి చూశాడు రాజు. నేనామెని చంపడం కళ్లారా చూశాడు!

బాస్టర్డ్! వీడిప్పుడు నన్ను పోలీసుల చేతుల్లో పెట్టాడు. లేకపోతే చిత్ర శవాన్ని డ్రమ్ములో చేర్చి నిండా తారు నింపి, సీలు చేసి కృష్ణా నదిలో ముంచేసే వాడ్ని! బాస్టర్డ్! వీడివల్ల అంతా బెడిసి కొట్టింది.

బాజ్జీ నా దగ్గరకొచ్చి అంటున్నాడు.

"మీరేదేనా చెప్పదల్చుకున్నారా, కిరణ్?"

అతన్ని చూసి బలహీనంగా నవ్వాను.

"చాలా చెప్పాలి, ఇన్ స్పెక్టర్....కొన్ని కాయితాలు, కలం యివ్వండి—వ్రాస్తాను."

"దట్స్ గుడ్!" అతను నవ్వుతూ వెళ్లిపోయాడు.

సరే! ఒక విషయంలో మాత్రం నాకు తృప్తి లభించింది. ఈ ఇన్ స్పెక్టర్ నాతో ఎంతో స్నేహ

పూర్వకంగా ప్రవర్తిస్తున్నాను. గతంలో ఏ పోలీసూ నాతో ఇలా ప్రవర్తించలేదు. ఇందుక్కారణం నాకు తెలుసు. నేనిప్పుడు డబ్బుగలవాడ్ని! నా ప్రస్తుత హోదా మళ్ళీ చిత్రహింసలకి గురికాకుండా కాపాడుతోంది!

నా నేరస్థ జీవితం ఇంత ప్రతిష్టాకరంగా ముగుస్తుందని ఎప్పుడనుకున్నాను?

బాడీ తిరిగివచ్చి కాయితాలూ కలం ఇచ్చాడు.

"ఇన్‌స్పెక్టర్. నేనో విషయమడగాలి...." అన్నాను నెమ్మదిగా.

"ఏమిటి?" అన్నాడతను నవ్వుతూ.

"విమల చనిపోలేదా....?" అడిగాను సందేహిస్తూ.

అతను వింతగా చూశాడు. "ఈ అనుమానం ఎందుకొచ్చింది? ఆమె చావును మీరే కళ్ళారా చూశారు."

"లేదు ఇన్‌స్పెక్టర్, ఆమె నిందాకే చూశాను...."

"చూశారా? ఎక్కడ?"

"బయట....పోక చెట్టు క్రింద. తెల్లచీరలో తల విరబోసుకుని—నిశ్చలంగా చూస్తూ కన్పించింది...."

అతను నవ్వాడు, "ఆమె చనిపోయింది, కిరణ్! బ్రతికుందనుకుంటే అది మీ అమాయకత్వం. దెయ్యమైందనుకుంటే అది మీ భ్రమ. మిమ్మల్ని వెంటాడుతున్న భయాలే ఆమె దెయ్యం రూపంలో సాక్షాత్కరించాయి"

కళ్ళు గట్టిగా మూసుకున్నాను. భ్రమ! ఎంతలో నా భవిష్యత్తును మలుపు తిప్పింది! నా పాపిష్టి ఆవేశంతో నిగ్రహం తప్పి ఎంత అవివేకంగా ప్రవర్తించాను!

ఇక ఇప్పుడు నా బ్రతుకంతా చీకటి! ఇది అంతులేని రాత్రి. మరపురాని రాత్రి. ఈ రాత్రి ఇక తెల్లారదు!

—: ఐపోయింది :—